## విలువైన ఆస్తులు, ఇనుప స్క్రాప్, పాత యంత్రాల పరిరక్షణ ప్రస్తుతం ప్రధాన సవాల్‌గా మారింది






జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

# ఆదిలాబాద్
## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

శనివారం 23 మే 2026 పేజీలు : 8


# రైతుల నెత్తిన పిడుగు



భారీగా ఎరువుల ధరలు పెంచేసిన కంపెనీలు బస్తాకు రూ.150 నుంచి రూ.400 వరకు భారం

సీజన్ ఆరంభానికి ముందే పెంపుదల ఇంకా పెరుగుతాయంటున్న డీలర్లు ఆందోళన చెందుతున్న అన్నదాతలు

*కష్టాలతో 'సాగు'తున్న అన్నదాతలపై మరో పిడుగు పడింది. రసాయన ఎరువుల ధరల పెంపుతో మరింత భారం పడనుంది. సర్కారు నిర్లక్ష్యంతో వడ్లు, మక్కలు, జొన్నలు అమ్ముకోలేక, అకాల వర్షాల నుంచి పంటలను కాపాడుకోలేక రైతులు ఇప్పటికే సతమతమవుతున్నారు. ఇదే సమయంలో కోటి ఆశలతో వానాకాలం సాగుకు సమాయాత్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం ఎరువుల పై ధరల మోత మోగించింది. ఫలితంగా ఒక్కో బస్తాపై రూ.150 నుంచి రూ.400 దాకా బాదడంతో రైతులపై పెనుభారం పడనుంది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశముందని డీలర్లు చెబుతుండడం అన్నదాతలను కలవరపాటుకు గురి చేస్తున్నది. వానకాలం సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఎరువులపై ధరల మోత మోగించింది. ఒక్కో బస్తాపై రూ.150 నుంచి రూ.400 వరకు పెంచేసింది. ఇప్పటికే పెరిగిన ధరలు అమల్లోకి రాగా, త్వరలో మరోసారి వడ్డన తప్పదని డీలర్లు చెబుతుండడం ఆందోళన కలిగిస్తున్నది.*

---

# ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి




నిర్మల్ పట్టణంలో జరుగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని పురపాలక కార్యాలయంలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియపై కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

# అగ్నిగోళంగా మారి మండుతున్న సూర్యుడు మండిపోతున్న తెలంగాణ

ఎండ వేడి తట్టుకోలేక బెంబేలెత్తుతున్న ప్రజలు

రెండో రోజు వరుసగా రాష్ట్రంలో 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు

మరో 4--5 రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిక

అవసరమైతే తప్ప బయటికి రావద్దు :మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



# నిరుపేద కుటుంబం నుండి 'డాక్టరేట్'

**-సరితకు ఘనసన్మానం**

**దండేపల్లి, మే 22 (ప్రజాజ్యోతి):** కృషి, పట్టుదల ఉంటే పేదరికం అడ్డుకాదని నిరూపించారు మామిడిపల్లి గ్రామానికి చెందిన గరిసందుల సరిత. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం నుండి డాక్టరేట్ పట్టా పొందిన సందర్భంగా, శుక్రవారం ఆమె స్వగ్రామం మామిడిపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయం వేదికగా ఘనసన్మానం జరిగింది.

**పరిశోధన అంశం**

సరిత గూడ అంజయ్య జీవితం,సాహిత్యంపై లోతైన పరిశోధన చేసి ఈ ఉన్నత పట్టాను అందుకున్నారు. ప్రస్తుతం ఆమె వనపర్తి జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలుగా సేవలు అందిస్తున్నారు.

**సన్మాన విశేషాలు**

గ్రామ సర్పంచ్ ఎల్లవు వైష్ణవి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సరితతో పాటు ఆమె భర్త సురేందర్ (ఈయన కూడా డాక్టరేట్ గ్రహీత కావడం విశేషం)ను శాలువాలు, పూలమాలలతో



గౌరవించారు.ఆమె కుటుంబ సభ్యులైన శంకరమ్మ, లక్ష్మణ్‌లను కూడా గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.ఒక నిరుపేద కుటుంబంలో జన్మించి, ఉన్నత చదువులు అభ్యసించి డాక్టరేట్ సాధించడం మామిడిపల్లి గ్రామానికి గర్వకారణం. భార్యాభర్తలిద్దరూ డాక్టరేట్ పొందడం వారి పట్టుదలకు నిదర్శనమని గ్రామ పెద్దలు కొనియాడారు.?ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు అలిశెట్టి లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ నూర తిరుపతి, వార్డు సభ్యులు గొట్ల మహేందర్, జిల్లపెల్లి భానుచందర్, శేఖర్, అలాగే గ్రామస్థులు గాలిపెల్లి సత్యనారాయణ, గంగన్న, యుగంధర్, మెరుగు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, 22, మే (ప్రజా జ్యోతి):** రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్న వరి ధాన్యాన్ని కేటాయించిన గోదాములు, రైస్ మిల్లుల్లో నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ మండల కేంద్రంలోని స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును శుక్రవారం మండల తహసిల్దార్ సంతోష్‌తో కలిసి సందర్శించిన జిల్లా కలెక్టర్ ధాన్యం నిల్వ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లిస్తూ నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు త్వరితగతిన తరలించాలని సూచించారు. గోదాములకు చేరిన ధాన్యం దిగుమతిలో ఆలస్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని, అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచుకోవాలని అధికారులకు సూచించారు.అనంతరం జైపూర్ మండలం ముదిగుంటలోని బీఎస్‌వై రైస్ మిల్, ఇందారంలోని వరలక్ష్మీ రైస్ మిల్లను మండల తహసిల్దార్ వనజరెడ్డితో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని, లారీలు ఎక్కువసేపు వేచి ఉండకుండా వెంటనే తిరిగి పంపేలా చర్యలు తీసుకోవాలని



ఆదేశించారు. ఈ ప్రక్రియలో అవసరమైన హమాలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు.రైస్ మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసేలా కృషి చేయాలని తెలిపారు. టేకుమట్లలోని బాలాజీ గోదాం, కుందారంలోని అన్నపూర్ణ రైస్ మిల్ గోదామును సందర్శించి ధాన్యం నిల్వ ప్రక్రియను త్వరగా ప్రారంభించాలని నిర్వాహకులకు సూచించారు.అనంతరం హాజీపూర్ మండల కేంద్రంలోని గాయత్రి రైస్ మిల్‌ను తహసిల్దార్ పుష్పలతతో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం ప్రక్రియను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సిఎంఆర్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు రైస్ మిల్లుల యజమానులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేడు జన్నారంలో కలప వేలం

**జన్నారం,మే 22(ప్రజాజ్యోతి)** జన్నారం ప్రభుత్వ కలప డిపోలో 23వ తేది శనివారం రోజున కలప వేలం పాట ఉంటుందని ఎఫ్ డి ఓ రామ్మోహన్ తెలిపారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. కొనుగోలుదారులు ప్రైవేటుటింబర్ డిపోల యజమానులు మరియు కలప సంబంధిత వృత్తిదారులు శనివారం ఉదయం 11గంటలకు ప్రభుత్వ కలప డిపోలో నిర్వహించే టింబర్ బహిరంగ వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.ఈ వేలంలో సుమారు 50 క్యూబిక్ మీటర్ల టేకు మరియు నాన్-టేకు కలపతో పాటు ఇతర మారుజాతి కలప వేలం వేయబడునని అన్నారు.కావున



ఆసక్తి గల కొనుగోలుదారులు, వర్తకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు.

## గెర్రె కాలనీలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**మంచిర్యాల, 22, మే (ప్రజా జ్యోతి):** కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మున్సిపల్ ఛైర్పర్సన్ పెద్దింటి పద్మ-శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం 6వ వార్డు గెర్రె కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎన్నో రోజులుగా కాలనీ ప్రజలు ఎదురుచూస్తున్న రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, రోడ్డు పనులు ప్రారంభం కావడం కాలనీ అభివృద్ధికి మంచి ఆరంభమని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించిన మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి, మున్సిపల్ ప్రజాప్రతినిధు లకు, అధికారులకు కాలనీ ప్రజల తరపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నాయకపు వినయ్ కుమార్, కౌన్సిలర్లు అంబటి శంకర్, సుంకరి శిరీష-సంతోష్, నజ్మా-ఆమేర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుర్మ అశోక్ గౌడ్, గడ్డం రంజిత్, చింతకింది ప్రశాంత్, అట్టెం లక్ష్మణ్, ముదిరాజ్ కుల పెద్దమనిషి రేండ్ల శంకర్, పిట్టల తిరుపతి, రేండ్ల లక్ష్మణ్, రేండ్ల సమ్మయ్య, చింతల సమ్మయ్యతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సెక్షన్ 26తో ఆర్టీఐకి ఊపిరి

**అధికారుల సమన్వయంతో గ్రామస్థాయిలో సదస్సులు**

**సహ రక్షణ చట్టం రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. కమలాకర్ వెల్లడి**




**ఆసిఫాబాద్ మే 22 (ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామస్థాయి వరకు సమాచార హక్కు రక్షణ చట్టం-2005 సొసైటీ ఆధ్వర్యంలో ఆర్టీఐపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సహ రక్షణ చట్టం రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. కొండగుర్ల కమలాకర్ తెలిపారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఆర్టీఐ చట్టం బలోపేతం కావాలని, సహ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ అధికారుల సమన్వయంతో కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం కోసం రాజ్యాంగబద్ధంగా ప్రజల చేతిలో ఉన్న ఏకైక అస్త్రం సహ చట్టమని అన్నారు. సమాచార హక్కు చట్టంతో పాటు మాదకద్రవ్యాల నివారణ, సైబర్ మోసాల పట్ల జాగ్రత్తలు, రోడ్డు ప్రమాదాల నివారణ, ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తమ సొసైటీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని డా. కమలాకర్ తెలిపారు.

## ఉపాధి పనులను పరిశీలించిన ఉప సర్పంచ్

**కూలీలకు చల్లటి నీరు, తాంసప్ పంపిణీ చేసిన మొహర్లే రమేష్**



**ఆసిఫాబాద్, మే 22 ప్రజా జ్యోతి**బెండారా గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను గ్రామ ఉప సర్పంచ్ మొహర్లే రమేష్ శుక్రవారం సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని ఆరా తీసిన ఆయన, కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇటీవల మండుతున్న ఎండలతో కూలీలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఉప సర్పంచ్ తన సొంత ఖర్చుతో కూలీలకు తాంసప్, చల్లటి నీరు పంపిణీ చేశారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగించినందుకు కూలీలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మొహర్లే రమేష్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ పనులు ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. చెరువుల పునరుద్ధరణ, మట్టి పనులు, రోడ్ల మరమ్మతులు వంటి అభివృద్ధి కార్యక్రమాల్లో కూలీలు చురుగ్గా పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అలాగే ఎండలో పనిచేసే సమయంలో కూలీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తరచూ నీరు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కూలీల సంక్షేమానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## లక్సెట్టిపేట కోర్టు లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా న్యాయవాది నాయిని సత్యగౌడ్ నియామకం



**జన్నారం,మే 22(ప్రజాజ్యోతి)** జన్నారం మండలం బాదం పల్లి గ్రామానికి చెందిన న్యాయవాది నాయిని సత్య గౌడ్‌ను లక్సెట్టిపేట కోర్టు లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నియమించారు. న్యాయ సేవలను పేదలకు అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా ఈ నియామకం జరిగిందని వారు వెల్లడించారు.న్యాయవాది సత్యగౌడ్ గత కొన్నేళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా నియమితులైన సందర్భంగా పలువురు న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు స్థానికులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆదివాసీ గ్రామాలకు రోడ్డు, నీటి సౌకర్యం కల్పించాలి

## సీపీఎం రాష్ట్ర నేత భూపాల్ డిమాండ్ : వేతనాలు తగ్గాయని విమర్శ




**ఆసిఫాబాద్ మే 22 ప్రజా జ్యోతి** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివాసీ గ్రామాలకు రోడ్లు, మంచినీటి సౌకర్యాలు తక్షణమే కల్పించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కనీస వేతనాల పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రకటనలు వాస్తవాలకు విరుద్ధమని భూపాల్ విమర్శించారు. ప్రస్తుతం వివిధ కేటగిరీల్లో రూ.13 వేల నుంచి రూ.24 వేల వరకు వేతనాలు అందుతున్నాయని, వాటిని రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచామని చెప్పడం వల్ల వాస్తవానికి వేతనాలు తగ్గినట్లేనని అన్నారు. బేసిక్ వేతనాలపై పెంపు చేయాలని డిమాండ్ చేశారు.జిల్లాలో వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.307 కనీస వేతనం అందడం లేదని, ప్రస్తుతం రూ.200 నుంచి రూ.270 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ పనుల వద్ద మంచినీరు, మెడికల్ కిట్, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో అమలు కావడం లేదన్నారు. సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాల ఫలితంగా 60 గ్రామాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేశారని, మిగతా గ్రామాల్లో కూడా కల్పించాలని కోరారు.ఆదివాసీ ప్రాంతాల్లో ఫారెస్ట్ అధికారుల దాడులు పెరిగాయని, కేంద్ర ప్రభుత్వ విధానాల పేరుతో రెవెన్యూ, అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా ఆదివాసీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఆదివాసీ గ్రామాల్లో తీవ్ర తాగునీటి సమస్య నెలకొన్నదని, ప్రజలు కిలోమీటర్ల దూరం నడిచి నీరు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని పెద్ద ఆసుపత్రి రిఫరల్ ఆసుపత్రిగా మారిపోయిందని, యంత్రాలు ఉన్నా డాక్టర్లు, టెక్నీషియన్లు లేక ప్రజలకు ఉపయోగపడటం లేదన్నారు. పీహెచ్‌సీల్లో కూడా డాక్టర్ల కొరత తీవ్రంగా ఉందని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రంలోని గ్రౌండ్‌ను పోలీస్ శాఖకు ఇవ్వడంతో క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే గ్రౌండ్‌ను క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని కోరారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుని భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్, గోడిసెల కార్తీక్, జె. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సమస్యలపై గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల పోరాటం

**సంయుక్తంగా సింగరేణి యాజమాన్యానికి, ప్రభుత్వానికి వినతి**

**మంచిర్యాల, 22,మే (ప్రజా జ్యోతి):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) కార్మికుల సంక్షేమం, కంపెనీ భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక సమస్యల పరిష్కారానికి గుర్తింపు హోదా సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య హోదా సంఘం ఐఎన్‌టీయూసీ లు సంయుక్తంగా సింగరేణి యాజమాన్యానికి, ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించాయి.సింగరేణి కార్మికుల్లో ఇటీవలి కాలంలో పెరుగుతున్న ఆందోళనలు, పరిపాలనపై నెలకొన్న అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కార్మికుల విశ్వాసాన్ని పునరుద్ధరించేలా యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయాలని సంఘాలు డిమాండ్ చేశాయి.కార్పొరేట్ మెడికల్ బోర్డు (సీఎంబీ)ను గత విధానంలోనే పునరుద్ధరించా లని, మెడికల్ అటెండెన్స్ రూల్స్ సవరణ చేపట్టాలని కోరాయి. కార్మికులకు సంబంధించిన కీలక అంశాలపై అన్ని వర్గాలతో చర్చించి పారదర్శక సమీక్ష నిర్వహించాలని సూచించాయి.కోల్ ఇండియా లిమిటెడ్ ఉద్యోగులు, ఎస్‌సీసీఎల్ ఎగ్జిక్యూటివ్‌ల మాదిరిగానే పెర్క్విజిట్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించాలని, ఉద్యోగుల కోసం "ఓన్ యువర్ ఓన్ హౌస్" పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల రికార్డుల్లో ఉన్న పేరు, అలియాస్ వ్యత్యాసాలను సరిచేయా లని విజ్ఞప్తి చేశారు.సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న 3,700కు పైగా కోర్టు కేసుల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఒకసారి లోక్ అదాలత్ నిర్వహించాలని, విజిలెన్స్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సంఘాలు డిమాండ్ చేశాయి.ఉపాధి అవకాశాల పెంపు, భవిష్యత్




ఇంధన భద్రత దృష్ట్యా కొత్త బొగ్గు గనులను ప్రారంభించాలని, గతంలో తొలగించబడిన ఎస్‌సీసీఎల్ కార్మికుల పునర్నియామకంపై మానవతా దృక్పథంతో ఒకసారి ప్రత్యేక పరిశీలన చేయాలని కోరాయి. అలాగే పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగ కేసులకు తక్షణమే ఆఫీస్ ఆర్డర్లు జారీ చేయాలని విజ్ఞప్తి చేశాయి.కార్మికుల సంక్షేమం, సంస్థ స్థిరమైన అభివృద్ధి కోసం పై సమస్యల పై యాజమాన్యం, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సంఘాల నాయకులు కోరారు.ఈ వినతిపత్రంపై గుర్తింపు హోదా సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు వి. సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కె. రాజ్‌కుమార్, ప్రాతినిధ్య హోదా సంఘం (ఐఎన్‌టీయూసీ) సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్, సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు ఎస్. నరసింహా రెడ్డి లు సంతకాలు చేశారు.

# ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయడం జరుగుతుంది





ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను సమన్వయంతో అమలు చేయాలి
మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, 22, మే (ప్రజా జ్యోతి):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి గణపతి, ముఖ్య ప్రణాళిక అధికారి పాపయ్య, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, చెన్నూర్, బెల్లంపల్లి, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్లు పద్మ, స్వాతి, సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు పడక గదుల ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు లాటరీ విధానంలో పారదర్శకంగా కేటాయిస్తామని , ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన వారికి ఇండ్లను కేటాయిస్తూ త్వరలో రెండో విడత ప్రారంభించనున్నట్లు తెలిపారు. పింఛనుదారుల జీవన ప్రామాణికరణ ప్రక్రియ కొనసాగుతోందని, నూతన పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని , ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు వివిధ వ్యాపార రంగాల్లో రుణ సదుపాయాలు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని, జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణం పూర్తై త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేసి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. రైతు సంక్షేమం కోసం రైతు భరోసా, రైతు బీమా పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి పంటలను కొనుగోలు చేసి ఆర్థికంగా ఆదుకుంటున్నామని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ బిల్లులు దశల వారీగా చెల్లిస్తున్నామని, పెండింగ్ బిల్లులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ప్రాథమిక పాఠశాల నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహారం పథకం త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. దండేపల్లి, సోమనపల్లి, బెల్లంపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణ పనులు ఒక్కోటి 200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి కుటుంబానికి బీమా సదుపాయం కల్పించేందుకు ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలు దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దివ్యాంగులకు మోటరైజ్డ్ వాహనాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయంలో పంట మార్పిడి విధానం, వాణిజ్య పంటలు, కూరగాయల సాగుపై రైతులకు రైతు వేదికల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజా సమస్యలపై తక్షణ స్పందనతో అధికారుల సమన్వయంతో పరిష్కార చర్యలు చేపడుతున్నామని, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో ఉపాధి హామీ కూలి మృతి



**జన్నారం,మే22(ప్రజాజ్యోతి)** వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతి చెందినట్లు ఎస్.ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. ఆయన తరుపున వివరాలు ప్రకారం జన్నారం బస్టాండ్‌లో వడదెబ్బ తగిలి ఉట్నూరు మండలం ఘన్పూర్ గ్రామానికి చెందిన కోవా కిరణ్ కుమార్ (27) మృతి చెందాడు.మృతుడు ఉపాధి హామీ కూలిగా పని చేస్తున్నాడు. మృతుని తమ్ముని ఫిర్యాదు మేరకు ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం...మృతుడు గురువారం రోజున ఉదయం ఉపాధి హామీ పనికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు.సెల్ ఫోన్ రిపేర్ చేయించేందుకు జన్నారం వెళ్తున్నానని అన్నకు చెప్పి బయలుదేరాడు.రాత్రి వరకు ఇంటికి రాకపోవడం,ఫోన్ కూడా లేకపోవడంతో కుటుంబ సభ్యులు తిరిగి వస్తాడని భావించారు.గురువారం ఉదయం వాట్సాప్ గ్రూపులో జన్నారం బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం రావడంతో, గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు.వారు బస్టాండ్‌కు చేరుకునే సరికి కిరణ్ కుమార్ మృతి చెంది ఉన్నాడు.తన తమ్ముడు వడదెబ్బతో మృతి చెందాడని మృతుని అన్న కోవా సుంగు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

## రాష్ట్ర ప్రభుత్వంపై రెడ్ అలర్ట్ ప్రకటించింది వెంటనే సింగరేణిలో పనివేళలు మార్చండి

జనక్ ప్రసాద్, సెక్రటరీ జనరల్, ఐఎన్టియుసి



**మంచిర్యాల, 22, మే (ప్రజా జ్యోతి):**సింగరేణి పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత కార్మికుల ప్రాణాలకు ముప్పుగా మారుతోందని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం “రెడ్ అలర్ట్” ప్రకటించిన నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం వెంటనే పనివేళలను మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో కార్మికులు తీవ్ర ఎండల్లో విధులు నిర్వహించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అన్నారు. ముఖ్యంగా ఉదయం వేళల్లోనే పనులు పూర్తి చేసేలా షిఫ్ట్ సమయాలను సవరించాలని సూచించారు. కార్మికులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు ప్రతి గనిలో అందుబాటులో ఉంచాలని కోరారు. ఎండల ప్రభావం అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికుల భద్రతకు యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జనక్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## పొనకల్‌లో ప్రభుత్వ భూమిలో షెడ్ల నిర్మాణానికి వినతి




**జన్నారం,మే22(ప్రజాజ్యోతి)** మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీ శివారు సర్వే నెం. 374, విస్తీర్ణం 5 ఎకరాల 10 గుంటల ప్రభుత్వ భూమిలో రోజువారీ సంత ఏర్పాటు కోసం షెడ్లు నిర్మించాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు. జన్నారం–పొనకల్ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, చికెన్, మటన్ విక్రయాలు జరుగుతున్నాయని,కుళ్లిపోయిన కూరగాయలు, వ్యర్థ పదార్థాలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అందుకే ప్రభుత్వ స్థలంలో షెడ్లు నిర్మించి రోజువారీ సంత నిర్వహించాలని, “స్వయంభూ శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ” నిర్మాణం కోసం 6 గుంటల స్థలం కేటాయించాలని "ఆదర్శ కళా సమితి భవనం" నిర్మాణానికి 6 గుంటల స్థలం కేటాయించాలని,తెలంగాణ ఉద్యమ కళాకారులకు ఇండ్ల స్థలాలు ఇప్పించాలని,అలాగే జన్నారం బస్టాండ్ నుండి ఎస్బిఐ బ్యాంక్ వరకు టాయిలెట్ రూం ఏర్పాటు చేయాలని కోరారు.జన్నారం, చుట్టుపక్కల మండలాల ప్రజలు ప్రతిరోజు వేల సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారని, వారికి కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు ఎస్.ఆర్ బోస్, డిసిసి అధ్యక్షులు శ్రీరాముల గంగాధర్, ఆర్ పి ఐ పార్టీ అధ్యక్షులు మోతె పురుషోత్తం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొండకూరి ప్రభుదాస్, తుడుం దెబ్బ మండల అధ్యక్షులు మరసకోల శ్రావణి, ఆదర్శ కళా సమితి అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగు తదితరులు ఉన్నారు.

## సంక్షేమ పథకాల అమలుపై జిల్లా స్థాయి సమీక్ష




**రామకృష్ణాపూర్, మే 22(ప్రజా జ్యోతి):** ఐడీఓసీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక సమావేశంలో క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి పాల్గొన్నారు.రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు,మహాలక్ష్మి,గృహ జ్యోతి, చేయూత, రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ తదితర పథకాల అమలుపై సమీక్షించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అర్హులందరికీ పథకాలు చేరేలా కృషి చేస్తామని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దీపక్ కుమార్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, డిప్యూటీ మేయర్, బెల్లంపల్లి, చెన్నూర్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి త్రాగు నీరు

**అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మార్మట్**




**కొమరం భీమ్ జిల్లా ప్రతినిధి ( వాంకిడి ) మే 22 ప్రజా జ్యోతి** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి త్రాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటు నట్లు అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్ అన్నారు న్యూ ఢిల్లీ నుండి కేంద్ర జల శక్తి మరియు గృహ నిర్మాణ పట్టణ వ్యవహరల శాఖా అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని విడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మార్మట్ పాల్గొన్నారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి త్రాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు ప్రతి ఇంటింటికి సురక్షితమైన త్రాగు నీరు అందించడం గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమములో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దత్తారావు జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి లక్ష్మి నారాయణ మిషన్ భగిరథ ఈ ఈ సిద్దిఖ్ పాల్గొన్నారు

## పామాయిల్ తోటలను పరిశీలించిన జిల్లా ఉద్యానవన శాఖ అధికారిణి



**జన్నారం,మే22(ప్రజాజ్యోతి)** జిల్లా ఉద్యానవన శాఖ అధికారిణి కె.సహజ శుక్రవారం మండలంలోని పొనకల్ గ్రామంలో మిక్కిలినేని రాజశేఖర్‌కు చెందిన పామాయిల్ తోటను, దేవుని గూడ గ్రామంలోని పామాయిల్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,రైతుల ఆదాయం పెంపొందించేందుకు ప్రభుత్వం సబ్సిడీతో ఆయిల్ ఫామ్ మొక్కలను సరఫరా చేస్తోందన్నారు. పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొక్కల పెంపకం, యాజమాన్య పద్ధతులు, రువుల వాడకంపై రైతులకు పలు సూచనలు చేశారు.

## ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

**సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ నేత సైదయ్య**

**తిరుపతి జిల్లా కార్యదర్శిగా ఎన్నిక**




**ఆసిఫాబాద్ మే 22ప్రజా జ్యోతి** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ రాష్ట్ర కార్యదర్శి ఎం. సైదయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం పార్టీ ద్వితీయ జిల్లా మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సైదయ్య మాట్లాడుతూ 80 ఏళ్ల స్వాతంత్ర్యంలోనూ అణగారిన వర్గాల బతుకులు దుర్భరంగానే ఉన్నాయని ధ్వజమెత్తారు. దళితులు, ఆదివాసీలు, మహిళలపై దాడులు కొనసాగుతున్నాయని, ప్రభుత్వాలు అరికట్టలేకపోతున్నాయని ఆరోపించారు. కేంద్రంలోని ఫాసిస్ట్ బీజేపీ విధానాలనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని, ఆగర్భ దరిద్రులుగా మారుస్తున్నారని మండిపడ్డారు. శాంతిభద్రతలు క్షీణించాయని, కేంద్రమంత్రి కుమారుడిపై కేసు పెట్టడానికే వెనుకాడుతున్నారని, చట్టం కొందరికి చుట్టంలా మారిందని ఆక్షేపించారు.ఏజెన్సీలో పోడు పట్టాల్లేవని, గిట్టుబాటు ధర లేదని, ఉపాధి కల్పించలేదని తెలిపారు. 1/70, పీసా చట్టాలు అమలు చేయడం లేదని, ఆదివాసీ మహిళలపై దాడులు, అమ్మాయిల అక్రమ అమ్మకాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మహాసభలో గోగర్ల తిరుపతిని జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 7గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. తిరుపతి మాట్లాడుతూ బడుగు వర్గాల పక్షాన పోరాడతానన్నారు. అనిల్, ప్రియా, శైలజ, బుదజీ, సంపత్, గులాబ్ పాల్గొన్నారు.

## ఇంధన్‌పల్లిలో హెల్త్ అవుట్‌రీచ్ క్యాంప్



**జన్నారం,మే22(ప్రజాజ్యోతి)**జనజాతీయ గౌరవ్ ఉత్సవ్ మరియు జన్ భాగీదారీ అభియాన్ 5వ రోజులో భాగంగా మండలంలోని ఇంధన్‌పల్లి గ్రామంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ ఆధ్వర్యంలో సమగ్ర హెల్త్ అవుట్‌రీచ్ క్యాంప్ శుక్రవారం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి,చికిత్స అందించారు. ఏ ఎన్ సి చెకప్‌లు,ఎన్ సీ డి లు,సికిల్ సెల్ డిసీజ్ మరియు టీబీ స్క్రీనింగ్ నిర్వహించారు. వడగాల్పులు,వడదెబ్బ లక్షణాలు, చికిత్స మరియు నివారణ చర్యలపై ఆరోగ్య అవగాహన కల్పించారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ లు డా.జి. ఉమాశ్రీ,డా. పి. ఆదిత్య బాబు,పీఎం జన్ మాన్ సిబ్బంది, ఎమ్మెల్ హెచ్పి కె. పూజ,జి. లక్ష్మి,కె. వసంత, హెల్త్ అసిస్టెంట్ కే.పోచయ్య,ఆశా కార్యకర్తలు ఎం.సుమలత, ఆర్.ఉమ,కె. సునీత,పి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## బాలిక విద్యను ప్రోత్సహించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ

**జిల్లా షెడ్యూల్ట్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్**




**మంచిర్యాల, 22, మే (ప్రజా జ్యోతి):**దళితుల బాలబాలికల విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా షెడ్యూల్ట్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ అ న్నారు. మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా షెడ్యూల్ట్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భాగ్యరెడ్డి వర్మ జయంతి కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంతరెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ తదితర అధికారులతో కలిసి హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళిత బాలబాలికల విద్యను ప్రోత్సహించడంలో భాగ్యరెడ్డి వర్మ కీలక పాత్ర పోషించారని తెలిపారు. సంఘసంస్కర్తగా దళిత బాలికల కోసం పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. సాహిత్యం, హరికథలు, ఉపన్యాసాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువ చ్చారని, బాల్య వివాహాలు, దేవదాసి, జోగిని వంటి దురాచారాల నిర్మూలనకు నిరంతరం పోరాడారని తెలిపారు. మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనంద దాయకమని, వారు చూపిన ఆదర్శ మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య

**మంచిర్యాల, 22, మే (ప్రజాజ్యోతి):** రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, మండల తహసీల్దార్ మల్లికార్జున్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు ప్రక్రియ, ధాన్యం నిల్వలు, రవాణా ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండాలని తెలిపారు. గోదాంలో ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతోందని, హమాలీల కొరత కారణంగా అన్‌లోడింగ్, లోడింగ్ పనులు ఆలస్యమవుతున్నాయని రైతులు, కార్మికులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కార్మిక శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అవసరమైన హమాలీలను తక్షణమే ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. గోదాం ఇన్‌చార్జ్‌లు, సంబంధిత అధికారులు విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా స్వీకరించి వేగంగా అన్‌లోడింగ్ చేపట్టాలని సూచించారు. ధాన్యం రవాణాలో ఇబ్బందులు తలెత్తకుండా తగిన సంఖ్యలో లారీలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రస్తుతం వస్తున్న ధాన్యం పరిమాణాన్ని దృష్టిలో ఉంచుకుని నిల్వ సదుపాయాలు మెరుగు పరచాలని, అన్‌లోడింగ్ ప్రక్రియను సులభతరం చేసే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు, ఇతర కారణాల వల్ల రైతులు నష్టపోకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కలిసికట్టుగా పనిచేసి ఉత్పత్తి సాధించి మనల్ని మనం నిరూపించుకోవాలి

యంత్రాల పనిగంటలు పెంచాలి

శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

ఐదవ రోజు మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు

**మంచిర్యాల, 22 మే (ప్రజా జ్యోతి):** సింగరేణి సంస్థలో అందరూ కలిసికట్టుగా పనిచేసి ఉత్పత్తి సాధించి మనల్ని మనం నిరూపించుకోవాలని, యంత్రాల పనిగంటలు పెంచాలని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఐకే ఓసీ, ఐకే-1ఏ గ్రూప్‌తో పాటు ఏరియా వర్క్‌షాప్ అండ్ స్టోర్‌లో శుక్రవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు నిర్వహించారు. ఐకే ఓసీ, ఐకే-1ఏ గ్రూప్‌లో జరిగిన ఎండీటీ సమావేశానికి ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐదవ రోజు మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు ఐకే ఓసీ, ఐకే-1ఏ గ్రూప్, ఏరియా వర్క్‌షాప్ అండ్ స్టోర్‌లో కొనసాగాయి. ఐకే ఓసీ, ఐకే-1ఏ గ్రూప్‌లో ఏరియా ఎస్‌వోటూ జీఎం కన్వీనర్‌గా టీమ్-1 సభ్యుల ఆధ్వర్యంలో సమావేశం జరగగా, ఏరియా వర్క్‌షాప్ అండ్ స్టోర్‌లో టీమ్-2 కన్వీనర్ ఆర్‌కే-7 గ్రూప్ ఏజెంట్ కూర్మ రాజేందర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సంస్థ స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులు, ఉత్పత్తి, ఉత్పాదకత, డ్రిల్స్ మరియు యంత్రాల వినియోగం, నాణ్యత, రక్షణ, సంక్షేమం తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులైన సోలార్, విండ్ తదితర మార్గాల వైపు అడుగులు పడుతున్నప్పటికీ థర్మల్ విద్యుత్‌కు మరో 25 ఏళ్ల పాటు అవసరం ఉంటుందని సర్వేలు చెబుతున్నాయని టీమ్-1 కన్వీనర్, ఎస్‌వోటూ జీఎం ఎన్. సత్యనారాయణ తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఉత్పత్తి ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేస్తేనే సింగరేణి మనుగడ సాధ్యమవుతుందన్నారు. గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోతుకూరి కొమురయ్య మాట్లాడుతూ, డ్యూటీలకు గైర్హాజరు కావడం వల్ల ఉద్యోగాలు కోల్పోయి, కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం పొందిన కుటుంబాలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి ఉద్యోగి క్రమం తప్పకుండా విధులకు హాజరై సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఏరియాలోని గనుల్లో ఉత్పత్తి, ఉత్పాదకత పెంచేందుకు అవసరమైన మెటీరియల్స్,




యంత్రాలు, టెక్నికల్ సపోర్ట్ విషయంలో ఏరియా వర్క్‌షాప్, స్టోర్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని టీమ్-2 కన్వీనర్ ఆర్‌కే-7 గ్రూప్ ఏజెంట్ కే. రాజేందర్ సూచించారు. ఐకే-1ఏ గని శ్రీరాంపూర్ ఏరియాలోనే కాకుండా సింగరేణిలోనే అత్యధిక లైఫ్ కలిగిన భూగర్భ గని అని ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. గత ఏడాది 84 శాతం మాత్రమే ఉత్పత్తి సాధించామని, ఈసారి నూరు శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. టూ సీమ్ సాత్‌లో కొత్త డిస్ట్రిక్ట్, త్రీ సీమ్‌లో మరో డిస్ట్రిక్ట్ ద్వారా ఎస్‌డీఎల్ యంత్రాలను పెంచి మానవ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటేనే లక్ష్యం సాధ్యమవుతుందని తెలిపారు . ఐకే ఓసీ 2020లో ప్రారంభమై మంచి ఉత్పత్తి సాధించినప్పటికీ, ఓబీ కాంట్రాక్ట్ సమస్యల కారణంగా గత ఏడాది వెనుకబడిందన్నారు. ప్రస్తుతం ప్రైవేట్ కాంట్రాక్టులు లేకపోవడంతో ఇతర ఓసీల నుంచి తీసుకొచ్చిన షావల్స్, ఆపరేటర్ల సహకారంతో అధికారులు, ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేసి ఉత్పత్తి పెంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండీటీ టీమ్-1 నుంచి ఎన్. సత్యనారాయణ (ఎస్‌వోటూ జీఎం), డీజీఎం(ఐఈడీ) రాజన్న, ఏజీఎం(ఫైనాన్స్) సుమలత, ఏజీఎం(ఈ అండ్ ఎం) రమణరావు, డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, డీజీఎం(సేఫ్టీ) విజయ్‌కుమార్, హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు. టీమ్-2 నుంచి ఆర్‌కే-7 గ్రూప్ ఏజెంట్ కూర్మ రాజేందర్, ఈఈ(ఐఈడీ) సాయికిరణ్, పీఈ(ఐకే ఓసీ) కృష్ణారావు, డీవైఎఫ్ఎం(ఫైనాన్స్) నరేష్, అడిషనల్ మేనేజర్(ఎస్టేట్స్) మహేష్, అడిషనల్ మేనేజర్(=ఉణ) అమర్‌నాథ్, డీవైపీఎం(పర్సనల్) రాజేష్‌తో పాటు ఐకే గ్రూప్ అధికారులు, ఉద్యోగులు, ఏరియా వర్క్‌షాప్ అండ్ స్టోర్ అధికారులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుల పదవులలో మాదిగలకు అన్యాయం




**జన్నారం,మే22(ప్రజాజ్యోతి)** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల ప్రకటన విడుదలలో మాదిగలకు అన్యాయం చేసిందని, ఉమ్మడి మాదిగలకు ఒక్కటైనా అవకాశం ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొండుకూరి ప్రభుదాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం రోజు ఆయన మాట్లాడుతూ 2024 గణాంకాల ప్రకారం రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులం తమదేనని అలాంటి తమకు కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. నామినేటెడ్ పదవుల్లో రాష్ట్ర, జిల్లా స్థాయి పదవుల్లో మాదిగలకు అవకాశం కల్పించాలని, మాదిగలు అమరవీరుల త్యాగాలతో మాదిగలకు అవకాశం కల్పించడం సామాజిక న్యాయమన్నారు. బలహీన వర్గాలకు మేలు చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ జిల్లా,రాష్ట్ర, మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవుల్లో మాదిగలు నామినేట్ చేయాలని, అన్ని పదవుల్లో మాదిగలకు జిల్లా మండల స్థాయిలో పెద్దపీట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగంపల్లి రాజలింగు, బాలు మాదిగ, మోతే పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాల పెంపు

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



**రామకృష్ణాపూర్, మే 22(ప్రజా జ్యోతి):** రాష్ట్రంలో 1.11 కోట్ల మంది కార్మికులకు లబ్ధి చేకూర్చేలా కనీస వేతనాలు పెంచినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు కాంగ్రెస్ శ్రేణులు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు పాలాభిషేకం చేశారు. రామకృష్ణాపూర్ సూపర్ బజార్‌లోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ 12 ఏళ్ల తర్వాత వేతనాలు సవరించడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. నిత్యావసరాల ధరలు పెరిగినా వేతనాలు పెరగక కార్మికులు ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీ మేరకు కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ జంగం కళ, సాగర్ రెడ్డి, పల్లె రాజు, ఆకుల రాజయ్య, కాసర్ల ప్రకాష్, మంద సృజన, బత్తుల వేణు, మేకల సురేందర్, ఏల్పుల సత్యనారాయణ, మాదాసు రాజ్ కుమార్, కార్మిక సంఘాల నాయకులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యతోనే సమాజ మార్పు : భాగ్యరెడ్డి

**జయంతి సభలో అశోక్ మహుల్కర్**



**ఆసిఫాబాద్ మే 22 ప్రజా జ్యోతి** దళిత ఉద్యమ పితామహుడు భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి వేడుకలను శుక్రవారం వాంకిడి జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఘనంగా నిర్వహించారు. దళిత, బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ హైదరాబాద్ లో దళిత ఉద్యమానికి పునాది వేసిన తొలి నాయకుడు భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. 1906–1933 మధ్య 26 దళిత బాలికల పాఠశాలలు స్థాపించి విద్యా వ్యాప్తికి కృషి చేశారని తెలిపారు. అంబేద్కర్ స్ఫూర్తితో దళిత హక్కుల కోసం జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో దుర్గం దుర్గాజీ, విజయ్ ఉప్రే, రోషన్ ఉప్రే, శ్యామ్‌రావు దుర్గే, దీపక్ దుర్గే, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

**అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలకు జిల్లా ఆరోగ్య శాఖ సూచనలు**




**మంచిర్యాల, 22 మే (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లాలో రోజురోజుకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ, సన్‌స్ట్రోక్, డీహైడ్రేషన్ వంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచించారు. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ఈ సమస్యలు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మంచిర్యాల మార్కెట్ ప్రాంతంలో కూరగాయల వ్యాపారులు, ట్రాఫిక్ సిబ్బందికి వడదెబ్బపై అవగాహన కల్పించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రజలు అవసరమైతే తప్ప మధ్యాహ్నం 11 గంటల తర్వాత బయటకు రావద్దని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మార్కెట్‌లో కూరగాయలు అమ్మే మహిళలు, ఇతర వ్యాపారులు తమ వద్ద ఎల్లప్పుడూ ఓఆర్ఎస్, మంచినీటి బాటిళ్లు ఉంచుకోవాలని తెలిపారు. తరచూ నీళ్లు, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని సూచించారు. రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు తాగాలని, తెలికపాటి లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని చెప్పారు. బయటకు వెళ్లేటప్పుడు తలపై గొడుగు లేదా తెల్లటి వస్త్రం ధరించడం మంచిదన్నారు. ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఎపిడిమాలజిస్ట్ సుమన్, ట్రాఫిక్ సిబ్బంది రాజమౌళి, మార్కెట్‌లోని కూరగాయల వ్యాపారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# జనక్ ప్రసాద్ కృషితోనే కోటి మంది కార్మికులకు లబ్ధి

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం

## కార్మిక పక్షపాతి రేవంత్ రెడ్డి




**తాండూర్ మే 22 ప్రజాజ్యోతి** కనీస వేతన సలహా మండలి చైర్మన్ జన ప్రసాద్ చూపిన చొరవ చేసిన కృషితోనే నేడు కోటి మంది కార్మికులకు లబ్ధి చేకూరిందని ఐఎన్టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రాములు అన్నారు శుక్రవారం తాండూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు జనప్రసాద్ తాను చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వారికి అందుతున్న వేతనాలు వాటి సవరణలపై దృష్టి సారించి ప్రభుత్వానికి నివేదికలు అందించడం జరిగిందని తదనుగుణంగానే ప్రభుత్వం కార్మికులకు లభి చేకూరేలా వేతన పెంపు నిర్ణయం తీసు తీసుకుందన్నారు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మిక పక్షపాతి ప్రభుత్వం అని మరోసారి నిరూపితమైందని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం హర్షనీయమన్నారు సింగరేణి గత ఎన్నికల్లో ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ అక్రమ పొత్తు పెట్టుకొని ఎన్నికల్లో గెలుపొందిన నాటినుంచి ఈ రెండున్నర సంవత్సరాల్లో కార్మికుల సమస్యలపై తీవ్ర నిర్లక్ష్య వైఖరిని అవలంబించింది అన్నారు. నేడు మళ్ళీ ఎన్నికల సమీపిస్తున్న వేళ ఈ రెండు యూనియన్లు కొత్త నాటకానికి తినలేకపోయాయని కార్మిక సమస్యల కోసం పోరాడుతున్నట్లు నటిస్తూ కార్మికులను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నా అన్నారు. సమ్మెలు ధర్నాలు ఉద్యమాలు అంటూ మరోసారి కార్మిక వర్గాన్ని మోసగించేలా చూస్తున్నారని కార్మికులు ఈ కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న తరుణంలో యాజమాన్యం డ్యూటీ షిఫ్ట్ వేళలు మార్చి కార్మికులకు ఉపశమనం కల్పించేలా చూడాలన్నారు బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా యాజమాన్యం చొరవ తీసుకోవాలన్నారు. సింగరేణి మనుగడకు కొత్త గనులే ఆధారమని బెల్లంపల్లి ఏరియాలో గోలేటి మహవీర్ కానీ ఓపెన్ కాస్ట్‌లు ఏర్పాటుకు యాజమాన్యం చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కవిత టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలుగా ఉన్న సమయంలోనే కేంద్ర ప్రభుత్వం బొగ్గు బావుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తీసుకుందని అప్పుడు స్పందించని కవిత నేడు నూతన గనులు తీసుకువస్తామని కార్మిక హక్కులను కాపాడుదాం అని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్మిక హక్కుల సాధన ఐఎన్టీయూసీ తోనే సాధ్యమని ఐఎన్టీయూసీ సాధించిన హక్కులను కూడా తామే సాధించినట్లుగా ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. రాబోయే రోజుల్లో ఐఎన్టీయూసీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కి కార్మికులు అండగా ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శిలు మాధవ కృష్ణ చంద్రకుమార్ ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శి మాసాడి నారాయణ కైరిగూడ కార్యదర్శి భాస్కరాచారి తదితరులు ఉన్నారు.

# మ్యాన్ రైడింగ్ కార్మికులందరూ దిగే వరకు నడపాలి

## ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్రావు







**మంచిర్యాల, 22 మే (ప్రజా జ్యోతి):** సింగరేణి గనుల్లో మ్యాన్ రైడింగ్ కార్మికులందరూ దిగే వరకు నిరంతరంగా నడపాలని ఐఎన్టీయూసీ యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్రావు యాజమాన్యాన్ని కోరారు. "బాయ్ బాట" కార్యక్రమంలో భాగంగా ఆర్కే–5 గనిని జెట్టి శంకర్రావు నేతృత్వంలో కేంద్ర కమిటీ నాయకులు, ఏరియా నాయకులు, కేంద్ర ఉపాధ్యక్షులు గరిగే స్వామి, తిరుపతిరాజు (సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ & మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్), పిట్ సెక్రటరీ సంబయ్య తదితరులు శుక్రవారం సందర్శించి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, మ్యాన్ రైడింగ్ సమయానికి అందుబాటులో లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కార్మికులందరూ దిగే వరకు మ్యాన్ రైడింగ్ సేవలు కొనసాగించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే కోల్ కట్టర్ బిట్లు, డ్రిల్ రాడ్లు, డ్రిల్ మిషన్లు సరైన సమయానికి అందుబాటులో లేక పనుల్లో ఆటంకాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. పిట్టర్స్, ఎలక్ట్రీషియన్లపై అధిక పనిభారం మోపుతూ ఒక్కరితో మొత్తం మైన్ బాధ్యతలు నిర్వహింపజేస్తూ చార్జిషీట్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఎస్‌డీఎల్ ఆపరేటర్లకు ముగ్గురు కేబుల్ బాయ్స్ ఇవ్వాల్సిన చోట ఇద్దరినే నియమించి అదనపు పనిభారం మోపుతున్నారని, అనంతరం చార్జిషీట్లతో వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. గని లోపల కార్మికులకు తాగునీటి సౌకర్యం సరిగా లేకపోవడం, గాలి సరఫరా తక్కువగా ఉండడంతో తీవ్ర ఉక్కపోతలో పని చేయాల్సి వస్తోందని కార్మికులు యూనియన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను గని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు, కేంద్ర ఉపాధ్యక్షులు గరిగే స్వామి, తిరుపతిరాజు, పిట్ సెక్రటరీ సంబయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు మోతె రవి, మహేష్ రెడ్డి, రాజేందర్, కేంద్ర కమిటీ నాయకులు శ్రీనివాసరావు, ఏరియా నాయకులు మహేందర్ రెడ్డి, పెద్దిరాజు, గని నాయకులు దూట శీను, శ్రీధర్ల మల్లేష్, యాదగిరి, సాదిక్ శ్రీను, రవితేజ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# విలువైన ఆస్తులు, ఇనుప స్క్రాప్, పాత యంత్రాల పరిరక్షణ ప్రస్తుతం ప్రధాన సవాల్‌గా మారింది

### రక్షణ చర్యలు తీసుకుంటున్నప్పటికీ స్క్రాప్ దొంగలు వివిధ మార్గాల్లో చోరీలకు పాల్పడుతున్నారు.

### సింగరేణి ఆస్తుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

### సింగరేణి సంస్థ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (కార్పొరేట్) బాలరాజు





**మంచిర్యాల, మే 22 (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థకు చెందిన విలువైన ఆస్తులు, ఇనుప స్క్రాప్, పాత యంత్రాల పరిరక్షణ ప్రస్తుతం ప్రధాన సవాల్‌గా మారిందని సింగరేణి సంస్థ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (కార్పొరేట్) బాలరాజు అన్నారు. రక్షణ చర్యలు తీసుకుంటున్నప్పటికీ స్క్రాప్ దొంగలు వివిధ మార్గాల్లో చోరీలకు పాల్పడుతున్నసింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణలో భాగంగా సెక్యూరిటీ విభాగం పనితీరును పరిశీలించేందుకు సింగరేణి ఆస్తుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు . సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (కార్పొరేట్) బాలరాజు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో శుక్రవారం పర్యటించారు. శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, భద్రతా సిబ్బందితో కలిసి వివిధ గనుల్లో భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగరేణి సంస్థకు చెందిన విలువైన ఆస్తులు, ఇనుప స్క్రాప్, పాత యంత్రాల పరిరక్షణ ప్రస్తుతం ప్రధాన సవాల్‌గా మారిందని అధికారులు పేర్కొన్నారు. రక్షణ చర్యలు తీసుకుంటున్నప్పటికీ స్క్రాప్ దొంగలు వివిధ మార్గాల్లో చోరీలకు పాల్పడుతున్న నేపథ్యంలో దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక వ్యూహాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల మొదటి వారంలో బెల్లంపల్లి రీజియన్ సెక్యూరిటీ అధికారులతో శ్రీరాంపూర్ గెస్ట్ హౌస్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని స్క్రాప్ దొంగలను గుర్తించడం, వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం ద్వారా దొంగతనాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు . దానికి కొనసాగింపుగా శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7, ఆర్కే ఎన్‌టీఈ, ఎస్ఆర్‌పీ-1, ఎస్ఆర్‌పీ-3 గనుల పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను బాలరాజు పరిశీలించారు. అక్కడ నిల్వ ఉంచిన విలువైన ఇనుప సామాగ్రి, పాత యంత్రాలు, ఇతర పరికరాల రక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. గనుల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన కంచెలు, ట్రెంచ్‌లను పరిశీలించిన ఆయన సంస్థ ఆస్తుల పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా సెక్యూరిటీ విభాగం, ఎస్ అండ్ పీసీ సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సింగరేణి సెక్యూరిటీ విభాగం, పోలీస్ శాఖ పరస్పర సహకారంతో సంస్థ ఆస్తులను కాపాడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, షిఫ్ట్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌తో పాటు ఇతర సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్**



**మంచిర్యాల, 22,మే ( ప్రజా జ్యోతి ):** 2026--27 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షల్లో 7.0 సీజీపీఏ లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు కార్పొరేట్ ఇంటర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఈ నెల 20 నుంచి జూన్ 5 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు లో సమర్పించాలన్నారు. 10వ తరగతి మెరిట్ ఆధారంగా సీజీజీ ద్వారా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. అభ్యర్థులు మీ సేవ ద్వారా పొందిన ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడి, 10వ తరగతి మార్కుల మెమో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు సమర్పించాల్సి ఉంటుందన్నారు.అలాగే బీఏఎస్, హెచ్‌పీఎస్ విద్యార్థులు సంబంధిత పాఠశాల లేదా జిల్లా అధికారుల ద్వారా మ్యాపింగ్ చేసుకోవాలని, సీబీఎస్ఈ విద్యార్థులు జిల్లా అధికారుల ద్వారా 10వ తరగతి వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలంగాణలో చదివి ఉండాలని, ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహ విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు.ఇతర వివరాల కోసం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయాన్ని సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గంజాయి సేవించిన ముగ్గురికి 15 రోజుల రిమాండ్



**రామకృష్ణాపూర్, మే 22(ప్రజా జ్యోతి):** రామకృష్ణాపూర్‌లో గంజాయి సేవిస్తూ పోలీసులకు చిక్కిన ముగ్గురు నిందితులను న్యాయస్థానం 15 రోజుల పాటు డీఅడిక్షన్ కేంద్రానికి తరలించింది.ఎస్ఐ శ్రీధర్ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. వెంటాడి పట్టుకుని విచారించగా గంజాయి సేవించినట్లు అంగీకరించారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయగా ముగ్గురికీ పాజిటివ్ వచ్చింది. దీంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.చాకచక్యంగా నిందితులను పట్టుకున్న ఎస్ఐ శ్రీధర్, సిబ్బంది సంజీవ్, అఖిల్ రెడ్డిలను ఉన్నతాధికారులు అభినందించారు.

## మహిళా అధికారిని దూషించిన వ్యక్తిపై కేసు




**నేరడిగొండ, మే 22 (ప్రజాజ్యోతి):** మండలంలోని కుమారి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిణి (ఏఈఓ)ని కులం పేరుతో దూషిస్తూ, బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఇచ్చోడ రూరల్ సిఐ సిహెచ్ రమేష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం వెంకటాపూర్ గ్రామానికి చెందిన సాయి కీర్తన (28) (ఎస్టీ) నేరడిగొండ మండల కుమారి క్లస్టర్‌లో ఏఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. యాసంగి సీజన్ పంట నమోదు (క్రాప్ బుకింగ్) ప్రక్రియలో భాగంగా ఆమె ప్రభుత్వ ఆదేశాల మేరకు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో కుమారి గ్రామానికి చెందిన గడ్డం చంద్రశేఖర్ రెడ్డి (తండ్రి: రాజారాం) అనే వ్యక్తి తాను వార్తాపత్రిక విలేకరినని చెప్పుకుంటూ.. గతంలో పూర్తయిన తన భూమి వివరాలను తిరిగి నమోదు చేయాలంటూ ఫోన్ చేసి ఒత్తిడి తెచ్చాడు. అంతేకాకుండా, తన పని చేయనివ్వనని, తన గ్రామంలో తక్కువ కులం వారు పని చేయకుండా చూస్తానంటూ సదరు అధికారిణిని కులం పేరుతో అవమానిస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు నేరడిగొండ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 130/2026 కింద ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ పేర్కొన్నారు. ఈ కేసు నమోదు కార్యక్రమంలో నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల అక్రమ రవాణా

విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్న నేపథ్యంలో

సిర్పూర్ (యూ) పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో:

**5.45 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం ఇద్దరు నిందితులపై కేసు నమోదు,రిమాండ్:**

ఈ నకిలీ పత్తి విత్తనాలను పట్టుకోవడంలో కృషి చేసిన డిఎస్పి అశోక్, ఎస్సై విక్రం,పోలీసులు నాగేంద్రబాబు,నాగేంద్ర లను అభినందించిన:

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నీతిక పంత్:



**మే 22, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజా జ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లో నకిలీ పత్తి విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్న నేపథ్యంలో సిర్పూర్ (యు) పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్వహించి న వాహన తనిఖీల్లో 5.45 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ నితిక పంత్ తెలిపారు. ఈ నకిలీ విత్తనాలు పట్టుకోవడంలో కృషి చేసిన డిఎస్పి అశోక్ ఎస్సై విక్రం, కానిస్టేబుల్స్ నాగేంద్రబాబు, నాగేంద్రలను జిల్లా ఎస్పీ నీతిక పంత్ అభినందించారు. అందరం ఎస్పీ నీతికపత్ మాట్లాడుతూ..శుక్రవారం సిర్పూర్ (యు) పోలీస్ స్టేషన్ సమీపంలో ఎస్ఐ విక్రమ్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపడుతున్న సందర్భంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించి వారి వద్ద నుంచి మొత్తం 68 కిలోల (152 ప్యాకెట్లు) పత్తి విత్తనాలు లభించా యి ఒక్కో ప్యాకెట్‌లో సుమారు 450 గ్రాముల చొప్పున విత్తనాలు ఉండగా, వాటిపై ప్రభుత్వ ఆమోదిత వివరాలు, క్యూ ఆర్ కోడ్, హాలోగ్రామ్, లాట్ నెంబర్ వంటి గుర్తింపులు లేకపోవడం గమనించి,దీంతో వెంటనే వ్యవసాయ శాఖ అధికారి ఆనందరావుకు సమాచా రం అందించగా, వారు పరిశీలించి వాటిని నకిలీ పత్తి విత్తనాలుగా నిర్ధా రించాలని అన్నారు. అనంతరం పంచనామా నిర్వహించి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.ఈ కేసుపై ఆసిఫాబాద్ సబ్ డివిజన్ డిఎస్పి అశోక్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టగా, గత రెండు నెలలుగా సిర్పూర్ (యూ) మండల పరిధిలో సుమా రు 6.75 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను లాభా పేక్షతో రైతులకు సరఫరా చేయాలనీ తీసుకొనిరాగా నిందితుడు ఏ 2 నైతం జంగు ఇంటి వద్ద మరో (1100 ప్యాకెట్స్) 4.90 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకోగా, మొత్తం 5.45 క్వింటాళ్ళ నకిలీ పత్తి విత్త నాలు స్వాధీనం చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్న ట్లు పేర్కొన్నారు.కేసులో ఏ1నిందితులు మంగునాథ్ తండ్రి సమందర నాథ్, వయస్సు:64 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: జూనపాని, మధ్యప్రదేశ్. ప్రస్తుతం: ఇంద్రవెల్లి, ఆదిలాబాద్ జిల్లా, ఏ2 నైతం జంగుతండ్రి నానాజీ, వయస్సు: 40 సంవత్సరాలు, వృత్తి: మేస్త్రి, నివాసం: సిర్పూర్ (యు), కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా. ఏ 1 అదేవిధంగా ఏ2 ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్ కు తరలించడం జిల్లా ఎస్పీ నీతిక పంత్ తెలిపారు.రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తం గా ఉండాలని, ప్రభుత్వ అనుమతులు ఉన్న విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని జిల్లా ఎస్పీ నీతిక పంత్ సూచించారు. నకిలీ విత్తనాల సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లో గాని, డయల్ 100 ద్వారా గాని తెలియ జేయాలని కోరారు.

# అగ్ని గోళంగా మారి మండుతున్న సూర్యుడు మండిపోతున్న తెలంగాణ

**ఎండ వేడి తట్టుకోలేక బెంబేలెత్తుతున్న ప్రజలు**

**రెండో రోజు వరుసగా రాష్ట్రంలో 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు**

**మరో 4--5 రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిక**

**అవసరమైతే తప్ప బయటికి రావద్దు :మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, 22 మే (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ఎండలతో అగ్ని కుండంలా మారింది. సూర్యుడు నిప్పులు చె రుగుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. రెండో రోజు వరుసగా పలు జిల్లాల్లో 46 నుంచి 47 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ముఖ్యంగా మంచిర్యాల జిల్లాలో మండు తున్న ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో సాధారణ జీవనం అస్తవ్యస్తమైంది. బొగ్గు గనులు అధికంగా ఉన్న కోల్ బెల్ట్ ప్రాంతమైన మంచిర్యాలలో సాధారణంగా ప్రతి ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. అయితే ఈసారి మాత్రం రికార్డు స్థాయిలో 45 నుంచి 50 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 8.30 గంటల తర్వాత నుంచే బయటకు రావడానికి భయపడుతున్నారు. మధ్యాహ్న సమయంలో రహదారులు నిర్మాను ష్యంగా మారుతున్నాయి. కూలర్లు, ఏసీలు వాడుతున్నప్పటికీ వేడి గాలులు, ఉక్కపోత నుంచి ఉపశమనం లభించక ప్రజలు బిక్కిరి అవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శీతల పానీయాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఐస్‌క్రీములు తీసుకుంటూ ప్రజలు తాత్కాలిక ఉపశమనం పొందు తున్నప్పటికీ కొద్దిసేపటికే మళ్లీ వేడి తీవ్రత పెరుగుతుండటంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. మరోవైపు ఎండల కారణంగా విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. జిల్లాలో కూలిం గ్ పరికరాల వినియోగం అధికమవడంతో విద్యుత్ లోడ్ పెరిగిం దని అధికారులు తెలిపారు. మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లే వారు తలపై గుడ్డలు కప్పుకుని, నీటి బాటిళ్లు వెంట తీసుకెళు న్నారు. రోడ్లపై వాహనాల రాకపోకలు కూడా గణనీయం గా తగ్గా యి. వ్యవసాయ పనులు, నిర్మాణ పనులు, రోడ్డు పనుల్లో పనిచేసే కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికులు కూడా అధిక ఉష్ణోగ్రతలతో అవస్థలు పడుతున్నారని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఎండల తీవ్రత కార ణంగా పలు చోట్ల వడదెబ్బ కేసులు నమోదవుతు న్నాయని వైద్యు లు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య బృందాలను సిద్ధం చేసినట్లు సమాచారం. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకా రం వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణో గ్రతలు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో రెడ్ అలర్ట్ కొనసాగుతోంది. టి జి డి పి ఎస్ డేటా ప్రకారం మునగాల, సూర్యాపేట మరియు ముత్తారం మంథని, పెద్దపల్లి ప్రాంతాల్లో అత్యధికంగా 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మందమర్రి, మంచిర్యాల, ధర్మపురి, జగిత్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, వైరా, ఖమ్మం, పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం, వెంకటాపూర్, ములుగు, కాళేశ్వరం, భూపాలపల్లి, కట్టంగూర్, నల్గొండ, కమలాపూర్,









హనుమకొండ, గంగాధర, కరీంనగర్, వేములవాడ రూరల్ ప్రాంతాల్లో 46.4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భువనగిరి, మామ్డా, మోర్తాడ్, కురవి ప్రాంతాల్లో 46.3 డిగ్రీలు, జైనాద్, నల్లబెల్లి ప్రాంతాల్లో 46.2 డిగ్రీలు, అక్కన్నపేటలో 46.1 డిగ్రీలు నమోదయ్యాయి. డోర్నీ, చిల్పూర్, శంకరంపేట, మాద్గుల్ ప్రాంతాల్లో కూడా 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ...............**


ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. అవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దని హెచ్చరించారు. ముఖ్యంగా రైతులు, కూలీలు, చిన్నారులు, వృద్ధులు ఎండలో ఎక్కువసేపు ఉండకూడదని తెలిపారు. తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని, తలపై గుడ్డలు లేదా టోపీలు ధరించాలని సూచించారు. హీట్ స్ట్రోక్ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రికి వెళ్లాలని వైద్య శాఖ అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మొత్తం ప్రస్తుతం రెడ్ అలర్ట్‌లో ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# రైతుల నెత్తిన పిడుగు

**భారీగా ఎరువుల ధరలు పెంచేసిన కంపెనీలు బస్తాకు రూ.150 నుంచి రూ.400 వరకు భారం**

**సీజన్ ఆరంభానికి ముందే పెంపుదల ఇంకా పెరుగుతాయంటున్న డీలర్లు ఆందోళన చెందుతున్న అన్నదాతలు**




**మామడ మే 23 (ప్రజా జ్యోతి)** కష్టాలతో 'సాగు'తున్న అన్నదాతలపై మరో పిడుగు పడింది. రసాయన ఎరువుల ధరల పెంపుతో మరింత భారం పడనుంది. సర్కారు నిర్లక్ష్యంతో వడ్లు, మక్కలు, జొన్నలు అమ్ముకోలేక, అకాల వర్షాల నుంచి పంటలను కాపాడుకోలేక రైతులు ఇప్పటికే సతమతమవుతున్నారు. ఇదే సమయంలో కోటి ఆశలతో వానాకాలం సాగుకు సమాయాత్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం ఎరువుల పై ధరల మోత మోగించింది. ఫలితంగా ఒక్కో బస్తాపై రూ.150 నుంచి రూ.400 దాకా బాదడంతో రైతులపై పెనుభారం పడనుంది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశముందని డీలర్లు చెబుతుండడం అన్నదాతలను కలవరపాటుకు గురి చేస్తున్నది. వానకాలం సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఎరువులపై ధరల మోత మోగించింది. ఒక్కో బస్తాపై రూ.150 నుంచి రూ.400 వరకు పెంచేసింది. ఇప్పటికే పెరిగిన ధరలు అమల్లోకి రాగా, త్వరలో మరోసారి వడ్డన తప్పదని డీలర్లు చెబుతుండడం ఆందోళన కలిగిస్తున్నది.

**రైతుల నెత్తిన మరో పిడుగు**

యాసంగి సీజన్ పూర్తి కాకముందే ఎరువుల కంపెనీలు ధరలు పెంచేశాయి. ఇప్పటికే సమస్యలతో సతమతమవుతున్న అన్నదాతలకు ఇది మరింత ఇబ్బందికరంగా మారింది. ఓవైపు ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగక పోవడం, జొన్నల కొనుగోళ్లు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం, మక్కలు కొనేవాళ్లు దిక్కులేక పోవడంతో రైతులు తీవ్రంగా సతమతమవుతున్నారు. మరోవైపు అకాల వర్షాలు వెంటాడుతుండడంతో వారి కష్టాలు మరింత రెట్టింపయ్యాయి. ఈ నేపథ్యంలో ఎరువుల ధరలు భారం మీద పడడంతో అన్నదాత ఆగమవుతున్నాడు.

**ఏడాదిలో నాలుగుసార్లు మోత..**

ఎరువుల కంపెనీలు ఇష్టానుసారం ధరల మోత మోగిస్తున్నాయి. గత వానకాలం సీజన్ నుంచి ఇప్పటివరకు.. ఏడాది కాలంలో కాంప్లెక్స్ ఎరువుల ధరలను ఏకంగా నాలుగు సార్లు పెంచాయి. వివిధ రకాల ఎరువుల బట్టి బస్తాపై రూ.150 నుంచి రూ.400 వరకు పెరిగాయి. అంతేకాదు, అంతర్జాతీయ సంక్షోభాలు, సరఫరా సమస్యల కారణంగా మరోసారి పెంచేందుకూ సన్నాహాలు చేస్తున్నాయి. వారం పది రోజుల్లో బస్తాపై అదనంగా రూ.150 నుంచి రూ.300 వరకు పెరిగే అవకాశముందని ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు చెబుతున్నారు.

# ప్రభుత్వ బడిలో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు

**ప్రతి రోజు బడికి వచ్చేలా ప్రత్యేక చర్యలు – విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న ప్రభుత్వ బడి ప్రధానోపాధ్యాయులు అరవింద్ మైస.**



**మామడ మే 23 (ప్రజా జ్యోతి)** పోన్కల్ లో ఉన్న ఉన్నత ప్రభుత్వ పాఠశాల విద్యా రంగంలో కొత్త మార్పులకు శ్రీకారం చుడుతోంది. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పాఠశాలలో తరగతులను ప్రారంభించడానికి, నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిగత శ్రద్ధ, ఆధునిక సదుపాయాలతో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. జెడ్ పి హెచ్ ఎస్ విద్యార్థులకు బోధన అందించేందుకు వెల్ క్వాలిఫైడ్ టీచర్స్ ఉన్నారని తల్లి దండ్రులు గమనించి మీ యొక్క విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కొరకు ప్రభుత్వ పాఠశాలకు పంపవలసిందిగా ప్రధానోపాధ్యాయులు అరవింద్ మైసా విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. చిన్నారులకు పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయడంతో పాటు ఆటపాటల ద్వారా ఆనందకరమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ, ప్రతిరోజూ హోంవర్క్ ఇచ్చి చదువుపై ఆసక్తి పెంచుతున్నారు. పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత కల్పించారు. ప్రతి తరగతి గదిలో ఫర్నిచర్ ఏర్పాటు చేసి సౌకర్యవంతమైన వాతావరణంలో బోధన కొనసాగిస్తున్నారు. ఏఐ ఆధారిత కంప్యూటర్ శిక్షణతో విద్యార్థులను భవిష్యత్తు సాంకేతిక ప్రపంచానికి సిద్ధం చేస్తున్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అందిస్తున్నారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నారు. ముఖ్యంగా ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటల నుంచి 8:30 గంటల వరకు ప్రధానోపాధ్యాయుడు అరవింద్ మైసా స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి చదువుపై పర్యవేక్షణ చేయడం విశేషం. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఉచితంగా రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజనం, అందిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా మా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నాం. పొన్కల్ గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రధానోపాధ్యాయుడు అరవింద్ మైసా కోరారు.

## వైద్య శిబిరం



**నేరడిగొండ, మే 22 (ప్రజాజ్యోతి):** 9మండల కేంద్రమైన నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జన్ భాగీదారి అభియాన్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెచ్ఈఓ పవార్ రవీందర్, ఎస్సీఆర్పీ ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతోనే ఆరోగ్య అభియాన్ కార్యక్రమాలు విజయవంతమవుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే ఈ క్యాంప్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, ఆశా కార్యకర్త కనక కౌసల్య, అంగన్‌వాడీ టీచర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క బ్యాంక్ ఖాతాదారులు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

**వ్యవసాయ రుణాలు చెల్లించి ప్రభుత్వం,ద్వా రా వచ్చే సబ్సిడీలను వినియోగించుకోవాలి**

**తెలంగాణ గ్రామీణ బ్యాంకులో లైఫ్ ఇన్సూ రెన్స్ కంపెనీ లిమిటెడ్ లో 2 పాలసీలు చేసిన కోడూరి వెంకటేష్ మృతి చెందడంతో:**

**వారి కుమారుడు కోడూరి అంజన్నకు 15,26,250 చెక్కును అందజేసిన:**

**తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఉపేందర్ గౌడ్:**





**మే 22, సిర్పూర్ (టి) నియోజక వర్గ ప్రతినిధి ప్రజా జ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియో జకవర్గం లోని పెంచికల్పేట్ మండల కేంద్రానికి చెందిన కోడూరి వెంకటేష్ ఇటీవల మరణించడంతో అతని కుమారుడు కోడూరి అంజన్నకు 15,26,250 రూపాయల ఇన్సూరెన్స్ చెక్కును అందజేసిన తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఉపేందర్ గౌడ్.అనంతరం వారు మాట్లాడుతూ… తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ లో పెంచికల్పేట్ గ్రామానికి చెందిన కోడూరి వెంకటేష్ 2 లైఫ్ ఇన్సూరె న్స్ పాలసీలు చేసి ఇటీవ ల మృతి చెందడంతో వారి కుటుంబానికి 15 లక్షల26 వేల 250 రూపాయల చెక్కును అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్క బ్యాంక్ వినియోగదారులుఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా వ్యవసాయ రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పొందాలని కోరారు. బ్యాంకు సంబంధించిన అన్ని రకాల సేవలను కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఉపేందర్ గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమం లో సీనియర్ మేనేజర్ రఘువీర్ శర్మ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ గోపి కిషోర్, ఫీల్డ్ ఆఫీసర్ అనంత్, క్యాషియర్ అంజన్న ,ఎస్బిఐ లైఫ్ బిడియం అనిల్ కుమార్ పాల్గొన్నారు

# విద్య తోనే సమాజ అభివృద్ధి





## లక్ష్య సాధన తో అనుకున్న గమ్యానికి చేరాలి

## పదవ తరగతి విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**బాసర మే 22 (ప్రజా జ్యోతి)** విద్య తోనే సమాజ అభివృద్ధి జరుగుతుందని, విద్యార్థులు చదువులో రాణించి అనుకున్న గమ్యానికి చేరుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. శుక్రవారం బైంసాలోని ఎస్ ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, మెమెంటోను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకే గత కొన్ని సంవత్సరాలుగా అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. పేద విద్యార్థులు చదువుల్లో ప్రతిభ కనబరిచి వారు ఉపన్యాసాలు ఇస్తుంటే ఎంతో సంతోషం అనిపించింద న్నారు. కుటుంబంలో ఒకరు విద్యావంతులైతే ఆ కుటుంబమే బాగుపడుతుందన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఎంత ఎత్తుకు ఎదిగిన తల్లిదండ్రులను విస్మరించవద్దన్నారు.విద్యా వైద్యం సాగు నీరు లక్ష్యంగా తాను ముందుకు సాగుతున్నానని, విద్యాభివృద్ధికి పాటుపడతానని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుండి విద్యార్థులు రావడంతో ఎస్ ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ జన సంద్రమైంది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను సైతం ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, విద్యార్థులు మాట్లాడుతూ అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలోఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడలేని విధంగా ప్రతి సంవత్సరం విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించ డం మంచి పరిణామం అన్నారు. అనసూయ పవర్ ట్రస్ట్, ఎస్. ఎస్. స్టడీ సర్కిల్ ద్వారా నియోజకవర్గంలో వందలాది మంది యువతకు ఉద్యోగాలు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే ఎక్కడ లేని విధంగా ఎమ్మెల్యే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభి నందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ రాజేష్ బాబుతో పాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందిస్తాం

## అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మర్మాట్






**ఆసిఫాబాద్ మే -22 ప్రజా జ్యోతి** జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమా పథకాలు అందిస్తామని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మర్మాట్ అన్నారు శుక్రవారం సమీకృత కల్లెక్టరేట్ భవన సముదాయములోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా జిల్లా స్థాయి సమావేశానికి అదనపు కలెక్టర్ ఎం డెవిడ్ జిల్లా గ్రంథాలయ చైర్మెన్ అనిల్ జిల్లా రెవెన్యు అధికారి దాసరి వేణు ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మెన్ ఆకాష్ ఆసిఫాబాద్ రాజస్వ మండలధికారి లోకేశ్వర్ రావు తో కలిసి అదనపు కలెక్టర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు ప్రస్తుతం ప్రభుత్వం రైతు భరోసా ఇందిరమ్మ ఇళ్లు మహాలక్ష్మి, గృహ జ్యోతి , సన్న రకం వారి ధాన్యానికి క్వింటలుకు 500 రూపాయల భోనస్, చేయూత పెన్షన్, కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ ,మహిళా శక్తి బ్యాంకు లింకేజి ద్వారా వడ్డీలేని ఋణాలు, కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ చీరలు వంటి సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించడం జరుగుతుందని వచ్చే నెలలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అల్పాహారం, కుటుంబ జీవిత భీమా, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, దివ్యంగా విద్యార్థులకు వాహనాలు, పంటల మార్పిడి సేంద్రియ వ్యవసాయం ఆయిల్ ఫాం సాగు వంటి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు తిసుకుంటుశిదని సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పేదవారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తిసుకోవాలన్నారు అంతకు ముందు అదనపు కలెక్టర్ రెవిన్యూయం డెవిడ్ ముఖ్య మంత్రి సందేశం చదివి వినిపించారు ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖా, గృహ నిర్మాణ శాఖా, విద్యుత్ శాఖ, గ్రామిణాబివృద్ధి శాఖ పౌర సరఫరాల శాఖ అధికారులు తమశాఖల అద్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై సమావేశంలో వివరించారు ఈ కార్యక్రమములో జిల్లా అధికారులు సర్పంచులు కౌన్సిలర్లు ,మహిళా సంఘాల సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు

## వడదెబ్బతో ఎస్టీ హాస్టల్ ఉద్యోగిని మృతి



**నేరడిగొండ, మే 22 (ప్రజా జ్యోతి):**మండలంలోని బోరిగం గ్రామానికి చెందిన జాదవ్ లతాబాయి (54) వడదెబ్బకు గురై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లతాబాయి ఉట్నూర్‌లోని ఎస్టీ హాస్టల్‌లో ప్రభుత్వ కామాటీగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం తీవ్ర ఎండల కారణంగా ఆమె ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించ డంతో ఆమె సాయంత్రం దురదృష్టవశాత్తు కన్నుమూశారు.ఆమె అకాల మరణంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియలకు పలువురు ప్రజాప్రతినిధులు, ఐటీడీఏ ఉద్యోగులు హాజరై లతాబాయి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లతాబాయి మృతితో ఐటీడీఏ హెచ్‌డబ్ల్యూఓ కార్తీక్, రవి, రిటైర్డ్ ఈఈ భీమ్రావు ఆధ్వర్యంలో ఐటీడీఏ ఉద్యోగులు స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటూ అంత్యక్రియల (దహన సంస్కారాల) ఖర్చుల నిమిత్తం రూ.30 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, గ్రామ సర్పంచ్ రాథోడ్ వినేష్ తదితరులు పాల్గొని మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. శోకసప్తప్త కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## సీఎం సభ విజయవంతానికి కాంగ్రెసు కసరత్తు

### సర్పంచులు, ముఖ్య కార్యకర్తలతో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క సమీక్ష.

**కెరమెరి మే ప్రజా జ్యోతి** జూన్ 2న నిర్వహించనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క శుక్రవారం కెరమెరి మండలంలోని కేస్లాగూడ రైతు వేదిక లో సర్పంచులు, మండల స్థాయి ముఖ్య కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సభకు భారీగా జనసమీకరణ చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు.ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో సభకు తరలివచ్చేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. సీఎం సభ ద్వారా జిల్లాకు మరిన్ని అభివృద్ధి పనులు, హామీలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.సభ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా రవాణా, తాగునీరు, వాహనాల పార్కింగ్, కార్యకర్తల సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల వారీగా బాధ్యతలు అప్పగిస్తూ జనసమీకరణ లక్ష్యాలను వివరించారు.ఈ సమావేశంలో ఇందిరా ఫెలోషిప్ జిల్లా అధ్యక్షురాలు కోవ ఇందిరా, సాజిద్ దేశముఖ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సర్పంచులు కావుడే తులసిరాం, బాపూరావ్ ఆత్రం అన్నిగా, జాదవ్ అమూల్, రాథోడ్ బల్వంత్, వాగ్మరే శ్రీకాంత్ ,వినోద్ , కేశవ్, హరీష్, కాంగ్రెస్ నాయకులు రాథోడ్ శంకర్ నాయక్ జిల్లా కమిటీ సెక్రటరీ,రాథోడ్ సుదర్శన్ మందాడే విశ్వనాథ్, కోట్రంగే తిరుపతి మోహమ్మద్ సుజాయిత్ ఖాన్ జాదవ్ ప్రకాష్ రాథోడ్ దేవీదాస్, నాగేష్,గిడ్డప్ప, మురళి, జగన్నాథ్ రావు మాజీ సర్పంచ్ ,చౌహాన్ శంకర్,చాహకటి జంగు, భీంరావు, ఆత్ర?

# పెద్దపల్లి జిల్లా,నియోజకవర్గంలోని 6 మండ లాల్లోనిజమైన ఉద్యమ కారులను గుర్తించడానికి ఉద్యమకారుల వేదిక పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షులు ఆధ్వర్యంలో కమిటీలు వేయడం జరుగుతుంది

**పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఉద్యమకారుల వేదిక కు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రెస్ మీట్ లో మాట్లాడుతున్న ఉద్యమకారుల వేదిక స్టేట్ వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్:**




**మే 22,సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెద్దపల్లి నియోజకవర్గం లోని 6 ఆరు మండలాల్లో నిజమైన ఉద్యమకారు లను గుర్తించడానికి పెద్దపల్లి నియోజకవర్గం లోని 6 మండలాల అధ్యక్షుల నియామకం కొరకు ఉద్యమకారుల వేదిక కమిటీలు వేయడం జరుగుతుందని ఉద్యమ కారుల వేదిక ఉద్యమ నేతలు పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఉద్యమకారుల వేదిక స్టేట్ వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉద్యమకారు లతో కలిసి ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.తెలంగాణ సాధన కొరకు అమరవీరు లైన కుటుంబాలతోపాటు వికాలాంగులైన ఉద్యమ కారులను అదేవిధంగా ఉద్యమ సమయంలో జైలుకు వెళ్లి ఎఫ్ఐఆర్, బైండోవర్, కేసును నమో దైన వారిని అదేవిధంగా ఉద్యమ సమయంలో పాల్గొని వంట వార్పు, రైల్ రోకో, లో పాల్గొని పేపర్ కటింగ్ లు ఉన్న నిజమైన ఉద్యమకారులను గుర్తిం చి వారి యొక్క వివరాల ను సేకరించాలని పెద్దపల్లి నియోజకవర్గ 6 మండలా ల అధ్యక్షులు కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ఉంటే తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేరవని, బతుకులు బాగుపడవని ప్రత్యేక తెలంగాణ వస్తే సపరేట్గా మన నీళు మన నిధులు, మన నియామకాలు మనకు అందుతాయని తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందని పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు ఎన్నో త్యాగాలు చేసి,అవమానా లు భరించి లాటి దెబ్బలు తిని జైలు జీవితం గడిపి కేసుల పాలై,తమ తెలంగాణ కాన త్యాగాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. అంత కఠిన తరంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం కొరకు ఉద్యమాలు చేసి కొట్లాడి న ఉద్యమకారులను తెలంగాణ వచ్చిన తర్వాత గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో తెలంగాణ ఉద్యమకారులను గుర్తిం చడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి విఫలం చెంది కెసిఆర్ ప్రభుత్వం పడిపోయిందని తెలంగాణ వేదిక రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్ అన్నారు. కాబట్టి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఉద్యమ కారులను ఇచ్చిన హామీల ను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.గత 2,3, సంవత్సరాలు నుండి ఉద్యమ సంఘాలు ఎన్నో పోరాటాలుచేస్తూనే ఉన్నా యని అన్నారు. ఎట్టకేలకు తెలంగాణ ఉద్యమకారు ల సంక్షేమం కొరకు తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేయడం జరిగిం దని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీని తెలంగాణ ఉద్యమకారుల వేదిక ప్రశంసిస్తుంది. ఈ కమిటీ అర్హులైన నిజమైన ఉద్య మకారులను న్యాయం చేసే దిశగా కృషి చేయా లని భాష భావం వ్యక్తం చేశారు. నిజమైన ఉద్య మకాలను గుర్తించి అతి త్వరలో ఉద్యమకారుల ఆశయాలను,ఆకాంక్షల ను కొనసాగించాలని సూచించారు.ఈ కార్య క్రమంలో రాష్ట్ర కన్వీనర్ అనుముల కళావతి, రాష్ట్ర కో కన్వీనర్ తోడేటి స్వరూప,రాష్ట్ర ఉపాధ్య క్షురాలు గంగారపు శాంత, లక్ష్మి,ఉద్యమ నాయకులు సదానందం పాల్గొన్నారు.

# ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి







**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 22 , ( ప్రజాజ్యోతి).** నిర్మల్ పట్టణంలో జరుగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని పురపాలక కార్యాలయంలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియపై కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో భాగస్వామ్యమైన అధికారులను, ఈ ప్రక్రియకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే, పట్టణ ప్రాంతాలలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియ మరింత జాగ్రత్తగా నిర్వహించాలని పేర్కొన్నారు. హౌస్ లిస్టింగ్ కి సంబంధించి అధికారులను పలు ప్రశ్నలు అడిగి వారి అవగాహనను అంచనా వేశారు. ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రశ్నలు అడిగి అవసరమైన మేరకు వివరాలు సేకరించాలన్నారు. లిస్టింగ్ ప్రక్రియను మొత్తం పారదర్శకంగా పూర్తి చేయాలని వివరించారు. ఎక్కడా కూడా ఎటువంటి పొరపాటు చేయవద్దని అన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల



దృష్టికి తీసుకురావాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సిపిఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నజ్రుల్ నగర్ లో మాడ్రన్ ఫిష్ మార్కెట్ నిర్మించాలి

**జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ని కోరిన సిర్పూర్ (టి) శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ రావు:**



**మే 22, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజా జ్యోతి:** హైదరాబాద్ రాజేంద్ర నగర్లోని జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్,డా. బిజయ్ కుమార్ బెహెరా కు మర్యాదపూర్వకంగా కలిసిన సిర్పూర్(టి) ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ రావు,ఈ సందర్భం గా నజ్రుల్ నగర్ బెంగాలీ క్యాంపులో పెద్ద ఎత్తున చేపల పెంపకం అదేవిధం గా అమ్మకాలు జరుగు తున్నాయని, హోల్ సేల్ ఫిష్ మార్కెట్ నిర్మాణం కోసం నిధులు కేటాయిం చాలని జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ డా.బిజయ్ కుమార్ బెహెరా ను కోరిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.సానుకూలంగా స్పందించిన డా.బిజయ్ కుమార్ బెహెరా మాడ్రన్ ఫిష్ మార్కెట్ నిర్మాణం కోసం సహకరిస్తామని హామీ ఇచ్చారు.

# సిర్పూర్ నియోజక వర్గం మీదుగా గోవులు పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి

**డి.జి.పి సి.వి.ఆనంద్ కు వినతి పత్రం అందజేసి సూచించిన సిర్పూర్(టి) శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ రావు:**




**మే 22, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** హైదరాబాద్ పట్టణంలోని డి.జి.పి కార్యాలయంలో డి.జి.పి సి.వి.ఆనంద్ ను కలిసిన సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి డా. హరీష్ రావు డిజిపి సివి ఆనంద్ తో మాట్లాడుతూ మహారాష్ట్ర అదేవిధంగా చత్తీస్గడ్ నుండి సిర్పూర్ (టి) నియోజకవర్గం మీదుగా హైదరాబాద్ కుగోవులు మరియు పశువు లు అక్రమ రవాణా విపరీ తంగా పెరిగిపోతుందని అన్నారు. సిర్పూర్ ((టి) నియోజకవర్గంలోని కౌటాల మండలంలో పశువుల వారసంతను అడ్డగా చేసుకొని పశువు ల స్మగ్లర్లు రెచ్చిపోతున్నా రని అన్నారు. గోరక్ష దళ సభ్యులు అక్రమ రవాణా ను అడ్డుకుంటే పోలీసులు బైండోవర్ చేస్తూ అక్రమ కేసులు పెట్టి రిమాండ్ చేస్తామని బెదిరిస్తున్నారని అన్నారు.సిర్పూర్(టి) నియోజకవర్గం మీదుగా గోవులు పశువులు అక్రమ రవాణా ను అరికట్టాలని డిజిపి సీవీ ఆనంద్ వినతిపత్రం అందజేశారు. విపరీతంగా పెరిగిన పశువుల స్మగ్లింగ్ ను అరికట్టడానికి 16వ తేదీన కౌటాల పశువులసంత మూసి వేశారని తెలిపారు తరువాత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిడి మేరకు 20 వ తేదీన మళ్లీ సంతను ప్రారంభించారని అన్నారు. పోలీసులే దగ్గరుండి పశువుల అక్రమ రవాణాను ప్రోత్సహించడం అన్యాయమని దుయ్యబట్టారు. వెంటనే కౌటాలలోని పశువుల వారసంతను మూసి వేసి పెద్ద ఎత్తున జరుగుతున్న పశువుల స్మగ్లింగ్ ను అరికట్టాలని సిర్పూర్ (టి) ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కోరారు.

# అణగారిన వర్గాలను మేలు కొల్పిన వైతాళికుడు





**సామాజిక సంస్కర్త,**

**మాదరి భాగ్య రెడ్డి వర్మ సేవలు చిరస్మరణీయం అదనపు జిల్లా కలెక్టర్ రాజేశ్వర్**

**ఆదిలాబాద్ బ్యూరో, మే 22, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన ఆదిహిందు సోషల్ సర్వీస్ లీగ్ వ్యవస్థాపకులు మ్యాదరి భాగ్య రెడ్డి వర్మ 138వ జయం తి సందర్భంగా ఆ మహనీయు డికి ఘనంగా నివాళులర్పించారు. 1888మే 22 హైదరాబాద్ భాగ్యనగరంలో అత్యంత పేద కుటుంబంలో మ్యాదరి చర్మ కర వృత్తి చెందినవారు, అణగారిన వర్గాల అభ్యున్నతి, మహిళల విము క్తి, విద్యా ప్రాచుర్యం కోసం వారు చేసిన పోరాటాలు. జోగిని వ్యవస్థ రూపకల్పన. మద్య పానం పై వారి సేవలు మరువ లేనిదని, మనందరం వారి ఆశయాలను వారి సన్మార్గంలోసే వలన్సందించాల ని, అందవిశ్వాసం, అంటరానితనం కులా నిర్మాణం తో పాటు జోగిని దే వాదాసి వ్యవస్థ వ్యతిరేక పో రాటం, జ్ఞానం లేని జాతి బాని సగా మిగిలిపోతుందని విద్య ఉద్యమాన్ని నిర్మించారని అ న్నారు. సామాజిక సేవా కార్య క్రమాలు నేటి సమాజానికి స్ఫూర్తి దాయకమని. భారత దేశ సామాజిక చరిత్రలో అన గారిన జాతుల విముక్తి కోసం పోరాడి ప్రసిద్ధి చెందిన వారిలో డాక్టర్ అంబేద్కర్. మహాత్మా పూలె, పెరియార్ వారి సరసన తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకోని వారి సన్మార్గమ్మలో న డువాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ పేర్కొన్నారు. ఇదే కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లాలో అదనపు కలెక్టర్ సేవలువారి కృషిని అభినందిస్తూ వారికీ దళిత సంఘాల పక్షాన ఘనంగా సన్మానిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డిఆర్ఓ స్రవంతి, ఏవో వర్ణ, ఈడి మనోహర్ మాల సంక్షేమ సంఘ అధ్యక్షుడు రమేష్, మేకల మల్లన్న, స్వామి, మోచి సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలశంకర్ కృష్ణ, అంబేద్కర్ సంఘాల అధ్యక్షుడు అల్లూరి భూమ్మన్న, జనరల్ సెక్రటరీ నిమ్మల ప్రశాంత్ ,పూసం రాఘవేంద్ర.అరెల్లి మల్లేష్ ఎతీజూం జిల్లా అధ్యక్షులు దర్శనాల నగేష్, లోక్రి మనోహర్ సిందరే మహేందర్ మరియు పలు షెడ్యూల్ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. భాగ్యరెడ్డి వర్మ గారి ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక సమానత్వం, విద్యా అభివృద్ధి మరియు దళిత బహుజన హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఈసందర్భంగా పిలుపునిచ్చారు

# నిబంధనలు లేకుండా జొన్నలు కొనుగోలు చేయాలి

## జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించిన రైతులు



**ఆదిలాబాద్ బ్యూరో, మే 22, (ప్రజా జ్యోతి)** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో జొన్న పంటను ఎలాంటి నిబంధనలు విధించకుండా కొనుగోలు చేయా లని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు కి వివిధ గ్రామాల నుండి తీసుకొచ్చిన పలువురు రైతులతో కలిసి జొన్న పంటను పరిశీలన చేసి, ఆరుగాలం కష్టపడి ఈ (రబి) యాసంగి లో సీజన్లో జొన్నలు పండించి న రైతులు తమ పంట కాంట చేసిన లారీలల్లో లోడింగ్ కాక పోవడంతో తమ పంటని అతి తొందరగా లారీల కోసం ఎదురు చూస్తూన్న దృశ్యాలు కళ్ళ కు అద్దినట్టుగా కనిపిస్తుందని రైతు స్వరాజ్య వేదిక అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ఒక ప్రకట నలో తెలిపారు. కొంత మంది రైతులు ప్రయివేట్ వ్యాపార స్తులకు ఒక క్వింటాల్ కి 2500 నుండి 2వేల 700రూపాయల వరకు, తక్కువ ధరకు అమ్ము కోవడం వలన అతి తీవ్రంగా రైతుల ఆర్థిక బలహీనతగా ఆ సరాగా చేసుకోని నష్టపోవాల్సి న అవసరం ఏర్పడిందని అన్నారు. ఇకనైనా తమ పంటని రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న మార్కుఫెడ్ ఆధ్వర్యంలో పాక్స్ ద్వారా రైతులు పండించిన పూర్తి పంటని ఎలాంటి నిబంధన లేకుండా కొనుగోలు చేయవల సిన అవసరం ఉందని అయన అన్నారు. మరీ ముక్యంగా గన్ని బ్యాగుల సమస్య, కాంట చేస్తే లారీల సమ స్య, గోడౌన్‌ల సమస్యలను పరిస్కారం చేస్తామని జిల్లా కలెక్టర్ హామీచ్చారు. తమ అతి తొందరలో పంటని కొను గోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అ ధ్యక్షులు సంగెపు బొర్రన్న ఒక ప్రకటనలో తెలిపారు ఆదిలా బాద్ జిల్లాలో దాదాపుగా 1 లక్ష 12 వేల 316 ఎకరాలలో 39 వేల 189 మంది రైతులు జొన్న పంటని సాగుచేస్తున్న ట్లు వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఒక్కొక్క ఎకరాకి దాదాపుగా 20 నుం డి 25 క్వింటాల్ వరకు దిగుబ డి వస్తుందని, జిల్లాలో 30 లక్షల క్వింటాల్‌ల వరకు పంట దిగుబడి వస్తుంది కానీ ఇప్ప టికే 80 శాతం వరకు పంట కోత అయిపోయిందని రైతులు ద్వారా తెలుసుకోవడం జరిగిందని అన్నారు. గత నాలుగు రోజుల క్రితం అతి తీవ్రంగా ఈదురు గాలులతో కూడిన వడగళ్ళ వర్షం పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని. అతి త్వరలో కొనుగోలు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందులో రైతులు సంగెపు అమల్‌రాజ్, రాజు, మధు సూదన్, భీమ్‌రావు, విలాస్,తదితరులు పాల్గొన్నారు.

## బీరప్ప దేవాలయంలో కామరాతి కళ్యాణం బయ్యన్న పండుగ జాతర..



**బాసర మే 22 (ప్రజా జ్యోతి)** బాసర మండల కేంద్రంలో బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవంలో భాగంగా గత వారం రోజులుగా జరిగిన బీరప్ప కళ్యాణోత్సవం శుక్రవారం బయన్న పండగతో ముగిసింది. కురుమ సంఘం కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో పోచమ్మ,గంగమ్మ పండుగ,సరగు,లగ్గం,గద్దె బోనాల ను సమర్పించిన అనంతరం బయ్యన్న పండుగను ఘనంగా జరుపుకున్నారు,బీరప్ప దేవాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇంటిల్లిపాది కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు.

## అదిలాబాదులో వేగవంతంగా అభివృద్ధి పనులు

ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా సతీ ష్



**ఆదిలాబాద్ బ్యూరో, మే 22 (ప్రజా జ్యోతి)** అదిలాబాద్ పట్టణం తో పా టు మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం గా చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా సతీ ష్ అన్నారు. పట్టణంలో యు ఐడిఎఫ్ పథకం కింద 18 కోట్ల 70 లక్షలతో ప్రారంభమైన పనులలో అదిలాబాద్ పట్టణంలోని వార్డ్ నెంబర్ 33 కాలనీలో 10 లక్షలతో, వార్డ్ నెంబర్ 36 కాలనీలో 30 లక్షలతో, వార్డ్ నెంబర్ 43 కాలనీ లో 39 లక్షలతో జరిగే సిసి రోడ్లు డ్రైనేజీల పనులకు ఎమ్మె ల్యే పాయల్ శంకర్, ఎంపీ గోడం నగేష్ లతో కలిసి భూ మి పూజ చేసి పనులు ము న్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ ప్రారంభించారు. ఈ విధంగా మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ అదిలాబాద్ పట్టణంలో కోటి పది లక్షల రూ పాయల ఫ్లడ్ నిధులతో కల్వర్ట్‌లు, ప్యాచ్ వర్క్ లు కొన సాగుతున్నాయని, దాంతో పాటు రూ 18 కోట్ల 70 లక్షలతో వర్కులు ప్రారంభ మవుతున్నాయని అన్నారు. రూ 49 కోట్ల రూపాయల టీ యూ ఎఫ్ ఐ డి సి పనులు టెండర్ దశలో ఉన్నాయని, రాబోయే రోజుల్లో ఇంచార్జ్ మంత్రి జూ పల్లి కృష్ణారావు సహకారంతో ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు మరో 100 కోట్ల రూపాయలు కూడా ప్రభుత్వం నుండి అను మతులు వచ్చినా వెంటనే ప నులు ప్రారంభం జరుగుతాయని అన్నారు. ఈ విధంగా బండారి అనూష మాట్లాడు తూ అదిలాబాద్ పట్టణంలోని 49 వార్డులలో ఎక్కడ ఏ సమస్య లేకుండా చేసి చూస్తామని అన్ని కాలనీలలో రోడ్లు డ్రైనే జీలు , కల్వర్టులు నిర్మించే ప్ర యత్నం చేస్తామని చైర్ పర్సన్ బండారి అనూష తెలిపారు. ప్రజలు కొత్తగా వచ్చిన మున్సి పాలిటీని గమనించి చాలా వరకు పనులు టెండర్ దశలో ఉన్నందున రాబోయే రెండు నెలలు వర్షాల వలన కొద్దిగా ఆలస్యమైనా కూడా త్వరలో అన్ని వర్కులు కంప్లీట్ అయ్యే టట్లు చూస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని కాలనీలో సమస్యలు విడుతలవారీగా పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని తెలిపారు.

## భక్తులతో కిటకిటలాడిన బాసర క్షేత్రం



**బాసర మే 22 (ప్రజా జ్యోతి),**బాసర ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారిని భక్తులతో కిటకిట లాడింది. వేసవి సెలవు శుక్రవారం వేల సంఖ్యలో భక్తులు రావడంతో క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాలి. భక్తులు గోదావరి పుణ్యా స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు క్యూ లైన్ లో బారులు తీరారు. ఉదయం నుండి మ అమ్మవారి దర్శనానికి రెండు గంటలకు పైగా సమయం పట్టడంతోభక్తులు తీవ్ర అవస్తులు పడ్డారు. ఆలయ పరిసరాలలో త్రాగునీరు అందుబాటులో లేకపోవడంతో భక్తులు అధికారుల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల సంఖ్యలో వచ్చిన భక్తులకు కనీసం క్యూలైన్లో త్రాగునీరు లేకపోవడంతో చిన్నారులు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## సిర్పూర్ పేపర్ మిల్లు లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించా లని

**రిలే నిరాహార దీక్ష చేస్తున్న జెకె పేపర్ మిల్ కార్మికులను మద్దతు తెలిపిన**

**తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ సిర్పూర్ (టి) నియోజకవర్గ ఇన్చార్జి కావేటి సబితా మనోహర్ మద్దతు:**



**మే 22 సిర్పూర్ (టి) నియో జకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియో జకవర్గంలోని సిర్పూర్ కాగజ్ నగర్ పట్టణంలో సిర్పూర్ పేపర్ మిల్ లో గుర్తింపు కార్మిక సంఘం కార్మికులు ఎన్నికలు నిర్వ హించాలని పేపర్ మిల్ కార్మికులు నిర్వహి స్తున్న రిలే నిరాహార దీక్షలకు దీక్షలకు తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ సిర్పూర్ (టి) నియోజకవర్గ ఇన్చార్జి కావేటి సబిత మనోహర్ తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ సిర్పూర్(టి)నియో జకవర్గ ఇన్చార్జి కావేటి సబిత మనోహర్ మాట్లాడుతూ.... సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. జెకె పేపర్ మిల్ కార్మికుల రిలే నిరాహార దీక్షలో వారితో పాటు కూర్చొని పూర్తి మద్దతు తెలిపారు. వెంటనే పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని లేనియెడల రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులతో పెద్ద ఎత్తున అందోళన కార్యక్రమాలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు కార్మికులకు.జెకె యాజ మాన్యం అన్యాయం చేస్తుందని తెలిపారు. సిర్పూర్ కాగజ్ నగర్ జెకె పేపర్ మిల్లులో స్థానికులను నియమించకుండా సానికేతరులతో పేపర్ మిల్లు నడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానికులను కాదని స్థాని కేతులకు జైకె పేపర్ మిల్లు యజమాన్యం ఉద్యోగాలు కల్పించడం సరైన పద్ధతి కాదని దుయ్యబట్టారు. పేపర్ మిల్లులో స్థానికు లకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి స్థానికులకే ఉద్యోగాలు కల్పించి సరైన వసతు లు కల్పించాలని డిమాండ్ చేశారు.జెకె పేపర్ మిల్లు యాజమాన్యం మొండి వైఖరిని వీడాలని వెంటనే జేకే పేపర్ మిల్లు లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్ర మంలో తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స.హ చట్టం బలోపేతం కొరకు గ్రామ స్థాయి వరకు సెక్షన్ 26ను అనుసరించి

**సమాచార హక్కు రక్షణ చట్టంబి2005, ఆధ్వర్యంలో కార్యక్రమా లు నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ అధికారుల సమన్వ యంతో అవగాహన**

**సమాచార హక్కు రక్షణ చట్టంబి2005, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. కమలాకర్:**




**మే 22 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలోని కాగజ్నగర్ మండలంలో సమాచార హక్కు రక్షణ చట్టంబి 20 05 రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కమలాకర్ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టిఐ పై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం గా సమాచార హక్కు చట్టం బలోపేతం కొరకు గ్రామస్థాయి వరకు సమాచార హక్కు చట్టం సెక్షన్ 26 అనుసరించి సమాచార హక్కు రక్షణ చట్టంబి2005, ఎన్జీవో సొసైటీ ఆధ్వర్యంలో కార్య క్రమాలు నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ అధికా రుల సమన్వయంతో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి సామాన్య ప్రజలకు సమాచార హక్కు చట్టంపై వివరించి విశ్లేషించి, కులుప్తకరించి ఆర్టిఐ చట్టాన్ని బలోపేతం చేస్తామని అన్నారు.ఈ సందర్భంగా సమాచార హక్కు రక్షణ చట్టంబి 20 05 రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కమలాకర్ మాట్లా డుతూ.. గ్రామస్థాయి వరకు ఆర్.టి.ఐ చట్టం బలోపేతం కావాలని, సహ చట్టంలోని సెక్షన్ 26 అనుసరించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యంతో, ప్రభుత్వ అధికారుల సమన్వయంతో అవగాహన కార్యక్ర మాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శ కత, జవాబుదారితనం పరిపాలన కొరకు, రాజ్యాంగబద్ధంగా ప్రజల చేతుల్లో ఉన్నటువంటి ఏకైక అస్త్రం సహ చట్టం అని అన్నారు. సమాచార హక్కు చట్టంతో పాటు మాదకద్రవ్యాల (డ్రగ్స్) నివారణ, సైబర్ మోసాల పట్ల ప్రజల జాగ్రత్తలు, రోడ్డు ప్రమాదాల నివారణ, ప్లాస్టిక్ నివారణ పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కొరకు తమ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యచరణ చేపట్టడం జరుగుతుందని డా,, కమలాకర్ తెలిపారు. యువత విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అన్నారు. మత్తు కుటుంబాలని చిత్తు చేస్తుందన్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం తెలుపవద్దని సూచించారు.

## ఆసరా పెన్షన్ దారులు లైవ్ వెరిఫికేషన్ చేసుకోవాలి

**సికింద్రాబాద్ :** ఆసరా పెన్షన్ లబ్ధిదారులు లైవ్ వెరిఫికేషన్ అప్డేట్ కచ్చితంగా చేసుకోవాలని సికింద్రాబాద్ మండల్ రెవెన్యూ ఆఫీసర్ పాండు నాయక్ మీడియాకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు ఒంటరి మహిళలకు అందిస్తున్న ఆసరా పింఛన్ లైవ్ వెరిఫికేషన్ కార్యక్రమం చేపట్టిందని ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సికింద్రాబాద్ మండల్ పరిధిలోని 17500 మంది ఆసరా పెన్షన్ లబ్ధిదారుల లైవ్ వెరిఫికేషన్ కార్యక్రమం ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి 5 గంటల వరకు ప్రతి ఇంటికి వెళ్లి పెన్షన్ తీసుకునే లబ్ధిదారున్ని లైవ్ స్కానింగ్ ఫోటో సిబ్బంది వారికి కేటాయించిన ప్రాంతాలకు వెళ్లి తీసుకుంటున్నారని తెలిపారు. ఫోటో తీసుకునే సమయంలో కచ్చితంగా ఆధార్ కార్డు నెంబరు నమోదు చేసి చేస్తున్నామని వివరించారు. కొన్ని ప్రాంతాలలో స్థానికంగా ఉన్నటువంటి నాయకుల సహకారంతో కమ్యూనిటీ హాల్లో నీడ పట్టున ఉండేవిధంగా లబ్ధిదారులకు సమాచారాన్ని అందించి లైవ్ వెరిఫికేషన్ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల జూన్ 15వ తేదీ వరకు లైవ్ వెరిఫికేషన్ సికింద్రాబాద్ మండల పరిధిలో జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని లైవ్ వెరిఫికేషన్ ఫోటో దిగాల్సిందిగా కోరారు. లైవ్ వెరిఫికేషన్ లో ఫోటో దిగని మునుముందు ఈ ఆసరా పింఛన్ కి అనహర్హుల జాబితాలో చేరుస్తామని తెలిపార. కొన్ని అన్వాయ కారణాలవల్ల సాఫ్ట్వేర్ అప్డేట్ తో పాటు నెట్వర్క్ మొరా ఇస్తే తాత్కాలికంగా సేవలు నిలిపి తిరిగి కొనసాగిస్తామని తెలిపారు.

## మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ -

**సికింద్రాబాద్:** ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమ సుందరం వీధి, మక్తాల ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మక్తల జలంధర్ గౌడ్ ప్రారంభించారు. వేసవి దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో సుమారు 1000 మందికి పైగా చల్లని మజ్జిగను పంపిణీ చేశారు.మజ్జిగ స్వీకరించిన ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా ఫౌండేషన్ కొనసాగించాలని కోరారు.ఈ సందర్భంగా జలంధర్ గౌడ్ మాట్లాడుతూ, "ఎండ తీవ్రత నుండి ప్రజలకు ఉపశమనం కలిగించడమే మా లక్ష్యం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఫౌండేషన్ సభ్యులకు, కాలనీ వాసులకు పేరుపేరునా ధన్యవాదాలు" అని తెలిపారు. అలాగే "ఎండ తీవ్రతను తగ్గించుకోవాలంటే ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడాలి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జె.వి. సూర్య ప్రకాష్, హరికుమార్, ప్రసన్నకుమార్, మహేష్ పూజ, వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, జె.వి. భాస్కర్, సులోచన, నరేష్ కుమార్, కృష్ణ, శివకుమార్, వెంకట మోహన్, కిరణ్, శ్రీధర్ గౌడ్, శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

**కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత**

**జగిత్యాల:** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రం, పెగడపల్లి మండలంలోని బతికెపల్లి ఆరవెల్లి గ్రామల్లో ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు.అలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు